ఐదేళ్లకు మార్పు..!



నక్కనదొడ్డి సమీపంలోని ఐఓసీ ఇంధన గిడ్డంగి

నరసాపురంలో సమస్యగా మారిన రైలు వంతెన, మురుగునీరు

- నక్కనదొడ్డి అభివృద్ధికి ఐఓసీ నిధులు
- సీఎస్ఆర్ కింద రూ.2 కోట్లతో పనులు
- వైసీపీ హయాంలో పంచాయతీకి అన్యాయం
- టీడీపీ సర్పంచ్ ఉండటంతో కక్ష సాధింపు
- వేరే ప్రాంతాలకు సీఎస్ఆర్ నిధుల కేటాయింపు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మారిన తీరు

గుంతకల్లు, జూలై 31: ప్రభుత్వం మారడంతో నక్కనదొడ్డి పంచాయతీ కష్టాలు తీరే మార్గం సుగమమైంది. గ్రామంలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రకటించింది. టీడీపీ మద్దతు సర్పంచు ఉన్న పాపానికి ఐదేళ్లపాటు నక్కనదొడ్డి సమస్యలను ఎదుర్కొంది. ప్రభుత్వం నుంచి అభివృద్ధి పనులకు నిధులు రాలేదు. ఐఓసీ నిధులను రానివ్వకుండా వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. నిబంధనల మేరకు నక్కనదొడ్డికి వెచ్చించాల్సిన సీఎస్ఆర్ నిధులను ఇతర ప్రాంతాలకు మళ్లించారు. దీంతో గ్రామంలో రహదారులు, మురుగునీటి వ్యవస్థ, తాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. వైసీపీ ఓటమి, కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఐఓసీ అధికారుల ధోరణిలోనూ మార్పు వచ్చింది.

ఐదేళ్లుగా కష్టాలు

ఐఓసీ ఇంధన గిడ్డంగి ఏర్పాటుకు నక్కనదొడ్డి రైతులు 82.77 ఎకరాల భూములను ఇచ్చారు. కంపెనీల చట్టం-2013 ప్రకారం కార్పొరేట్ సంస్థలు తమ వ్యవస్థలు ఉన్న ప్రాంతాల అభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను వెచ్చించాలి. కానీ నక్కనదొడ్డి పంచాయతీలో టీడీపీ మద్దతు సర్పంచ్‌గా వరలక్ష్మి గెలవడంతో వైసీపీ ప్రభుత్వం అభివృద్ధికి అడ్డుపడింది. 2021లో పంచాయతీలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు కుర్చీలను ఐఓసీ అందజేసింది. మూడు గ్రామాలలో నీటి శుద్ధి ప్లాంట్లను నెలకొల్పింది. కానీ అవి నాసిరకం కావడంతో కొన్నాళ్లకే మూలనపడ్డాయి. నక్కనదొడ్డి పంచాయతీని కాదని, 2022లో గుంతకల్లు ఏరియా ఆసుపత్రికి రూ.14.60 లక్షలు వెచ్చించి బెడ్లను అందజేసింది. 2023లో అనంతపురంలోని సర్వజన ఆసుపత్రి తల్లిపాల నిల్వ కేంద్రం ఏర్పాటుకు రూ.40 లక్షలు ఇచ్చింది. ఇతర ప్రాంతాలకు సీఎస్ఆర్ నిధులను ఇవ్వడాన్ని తాము తప్పు పట్టడం లేదని, కానీ భూములను ఇచ్చిన తమ పంచాయతీని నిర్లక్ష్యం చేయడం ఏమిటని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హామీలను విస్మరించారు..

ఐఓసీ ఏర్పాటు సమయంలో అప్పటి కలెక్టరు, ఆర్డీవో సమక్షంలో స్థానికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు మాటిచ్చారు. స్థానిక యువతకు ఐఓసీలో ఉద్యోగాలను కల్పిస్తామని, పంచాయతీలో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ అవి నెరవేరలేదు. పంచాయతీలోని మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చి, వారికి 241 కుట్టు మిషన్లను ఇవ్వడానికి నిధులను విడుదల చేశారు. కానీ వాటిని పక్కనపెట్టేశారు. ఐఓసీలో హౌస్ కీపింగ్ ఉద్యోగాలను స్థానికులకు ఇవ్వకుండా ఒక్కొక్కటి రూ.2 లక్షలకు అమ్ముకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇంధన గిడ్డంగుల్లో రోజువారీ కూలీ పనులకు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను పిలిపిస్తున్నారు. స్థానికులను పనిలోకి తీసుకోవడం లేదు. పంచాయతీలోని మహిళలకు కుట్టు మిషన్లను వెంటనే అందజేస్తామని ఐఓసీ అధికారులు ఇప్పుడు చెప్పడం గమనార్హం.



స్థానికులకు ఉద్యోగాలివ్వాలి..

ఐఓసీ గోడౌన్లను నిర్మించేందుకు భూసేకరణ చేసినప్పుడు స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇవ్వలేదు. మా పంచాయతీలో చదువుకున్న యువకులు ఎంతోమంది ఖాళీగా ఉన్నారు. దిన కూలీలుగా కూడా వారిని పిలవడం లేదు. బయటి ప్రాంతాల నుంచి కూలీలను తెచ్చుకుంటున్నారే తప్ప, స్థానికులకు పనులు ఇవ్వడంలేదు. వెంటనే స్థానికులను ఉద్యోగాల్లోకి తీసుకోవాలి.

- మల్లికార్జున, ఎన్.నరసాపురం



ఉపాధి శిక్షణ ఇవ్వాలి..

ఐఓసీ సంస్థ స్థానికులకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణ ఇచ్చి, ఉచితంగా మిషన్లను అందజేయాలి. నాలుగేళ్లుగా ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టలేదు. స్థానికులకు అన్యాయం చేశారు. ఇప్పుడైనా ఐఓసీ అధికారులు మా గురించి పట్టించుకోవాలి.

- మురళి, నక్కనదొడ్డి

మౌలిక వసతులను కల్పించాలి

గుంతకల్లు మండలంలో పెద్ద పంచాయతీ నక్కనదొడ్డి. ఒక్క నరసాపురం మినహా పంచాయతీలోని నక్కనదొడ్డి, ఎస్.కొట్టాల, ఎస్.తండా తాగునీటి ఎద్దడితో విలవిలలాడుతున్నాయి. నాలుగు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేదు. రోడ్డు, అప్రోచ్ రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. నరసాపురంలో పైపులైన్లు శిథిలావస్థకు చేరాయి. మెయిన్ రోడ్డులోకి రావాలంటే రైలు వంతెన సమస్య ఉంది. వర్షాలకు వంతెనల కింద నీరు నిలబడుతోంది. అన్ని గ్రామాల్లో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరి, నిరుపయోగంగా మారాయి. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు. తాజాగా రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధులతో థర్డ్ పార్టీ ద్వారా అభివృద్ధి పనులు చేయిస్తామని ఐఓసీ ప్రకటించింది. కానీ గతంలో థర్డ్ పార్టీ ద్వారా నక్కనదొడ్డి, ఎస్.తండా, ఎస్.కొట్టాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ ప్లాంట్లు పనికిరాకుండా పోయాయని ప్రజలు అంటున్నారు. ఇకపై అలా జరగకుండా చూడాలని కోరుతున్నారు.



థర్డ్ పార్టీ వద్దు..

ఐఓసీ అధికారులు థర్డ్ పార్టీ కాంట్రాక్టరు ద్వారా అభివృద్ధి పనులను చేయిస్తామని అంటున్నారు. కానీ సీఎస్ఆర్ నిధులతో పంచాయతీ ఆధ్వర్యంలోనే పనులు జరిగేలా చూడాలి. మండల పరిషత్తు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో అభివృద్ధి పనులను చేపట్టాలి. గతంలో నక్కనదొడ్డి, ఎస్.కొట్టాల, ఎస్.తండాలో థర్డ్ పార్టీ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు ఏడాది గడవకనే మూలన పడ్డాయి. అత్యంత నాసిరకం ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ప్లాంట్లకు ఒక సంవత్సరం వారెంటీ ఉన్నా థర్డ్ పార్టీ కాంట్రాక్టరు పట్టించుకోలేదు. ఇప్పుడు కూడా థర్డ్ పార్టీకి పనులు కేటాయిస్తే నాణ్యత పాటించేది అనుమానమే. పంచాయతీ ఆధ్వర్యంలోనే పనులను చేయించాలి. నాణ్యత ఉండేలా ఐఓసీ అధికారులు, మండల అధికారులు పర్యవేక్షిస్తే సరిపోతుంది.

- వరలక్ష్మి, సర్పంచు, నక్కనదొడ్డి



ద్రోహం చేశారు..

వైసీపీ నాయకుల మాటలు విని ఐఓసీ అధికారులు మా పంచాయతీకి తీరని అన్యాయం చేశారు. మా రైతుల భూములు తీసుకుని, ఇతర ప్రాంతాలకు నిధులు ఇచ్చారు. అప్పటి ప్రభుత్వం మెప్పు పొందడానికి తాపత్రయపడ్డారు. స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి కాంట్రాక్టు ఉద్యోగాలను అమ్ముకున్నారు. మా పంచాయతీలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదు. పంచాయతీకి చెందిన 12 ఎకరాల భూమి తీసుకుని పరిహారం కూడా చెల్లించలేదు. ఎకరం పాతిక లక్షలు అనుకున్నా.. రూ.3 కోట్ల నిధులు పంచాయతీకి రావాల్సి ఉంది. మాట్లాడేందుకు కూడా మాకు అపాయింటుమెంటు ఇవ్వలేదు.

- తులసీరాం చౌదరి, మాజీ సర్పంచు

ఉదయమే పింఛన్లు పంచండి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, జూలై 31: పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ హెచ్చరించారు. జిల్లాలో పింఛన్ల పంపిణీపై అధికారులు, సిబ్బందితో బుధవారం ఆయన మాట్లాడారు. అన్ని ప్రాంతాల్లో గురువారం ఉదయం ఆరు గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభం కావాలని అన్నారు. పర్యవేక్షణ కోసం నియోజకవర్గ, మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. బయోమెట్రిక్ డివైజ్‌లు, యాప్‌లో సమస్యలు లేకుండా చూసుకోవాలని అన్నారు. లబ్ధిదారుల్లో ఎవరైనా మరణించి ఉంటే, లాగిన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసు బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

సమస్యల పరిష్కారానికి పెద్దపీట

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఆయన బుధవారం రెండో రోజు ప్రజా దర్బారు నిర్వహించారు. ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి ఆయన వినతి పత్రాలను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అధికారులు అర్జీలను పరిశీలించి, బాధితులకు తగిన పరిష్కారం చూపించాలని ఆదేశించారు.

అన్ని ప్రాంతాలకూ హంద్రీనీవా నీరు

అధికారులకు మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశం



హంద్రీనీవా అధికారులతో మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్

అనంతపురం/క్లాక్‌టవర్(ఆంధ్రజ్యోతి), జూలై 31: హంద్రీనీవా నీటిని ఎటువంటి ఆటంకం లేకుండా జిల్లాలోని అన్ని ప్రాంతాలకు అందించాలని జలవనరుల శాఖ అధికారులను మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. ఆర్ అండ్ బీ అతిథి గృహంలో హంద్రీనీవా పనులు, నీటి కేటాయింపులపై బుధవారం సమీక్ష నిర్వహించారు. హంద్రీనీవాకు ఈ ఏడాది శ్రీశైలం డ్యాం నుంచి 40 టీఎంసీల నీటిని కేటాయించారని తెలిపారు. నీటి ఎత్తిపోతల ఆలస్యమైందని, త్వరితగతిన జిల్లాకు తీసుకువస్తామని అన్నారు. చివరి ప్రాంతం వరకూ నీటిని అందించాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్ట్ పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే ఎవరి స్థాయిలో వారు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమీక్షలో జలవనరుల శాఖ సీఈ నాగరాజు, హంద్రీనీవా ఎస్ఈ దేసేనాయక్, ఈఈలు రాజా స్వరూప్ కుమార్, మురళి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మాతృశాఖలకు సమగ్రశిక్ష అధికారులు

రీప్యాట్రేషన్‌కు కలెక్టర్ ఆమోదం

అనంతపురం విద్య, జూలై 31: సమగ్రశిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల రీప్యాట్రేషన్‌కు కలెక్టర్ ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వంలో పలువురు అధికారులు సమగ్రశిక్ష ప్రాజెక్టులోకి వచ్చారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల సిఫార్సుతో కొందరు, అధికారులను ప్రసన్నం చేసుకుని మరికొందరు దొడ్డిదారిలో చేరిపోయారు. ప్రభుత్వం మారడంతో వారి పరిస్థితి ఏమిటన్న అంశంపై 'ఉందామా.. వెళదామా..?' శీర్షికన గత నెల 19న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ప్రాజెక్టులో పనిచేస్తున్న అధికారుల వివరాలను గతంలోనే కలెక్టరేట్ అధికారులు తెప్పించుకుని విచారించారు. ఈ నేపథ్యంలో పలు విభాగాల్లో పనిచేస్తున్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులను మాతృశాఖలకు రీప్యాట్రేషన్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, జీసీడీఓ మహేశ్వరి, అసిస్టెంట్ ఏఎంఓలు చంద్రమోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, అసిస్టెంట్ సీఎంఓ గోపాల్, అసిస్టెంట్ అలెస్కో గోవింద్ రెడ్డి, అసిస్టెంట్ ఐఈడీ షమ, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ రాంప్రసాద్‌ను, ఫారిన్ సర్వీస్ పీరియడ్‌ను పూర్తి చేసుకుని.. ప్రాజెక్టు పనిచేస్తున్న క్లర్కులు జిలాన్, గాయత్రిదేవిని సైతం రీప్యాట్రేషన్ చేశారు. కలెక్టర్‌తోపాటు ఏపీసీ నాగరాజు ఆ ఫైల్‌కు ఆమోదం తెలిపారు. డీఈఓ వరలక్ష్మి ఆమోదం తెలిపి.. ఒకటి రెండు రోజుల్లో వారిని రిలీవ్ చేస్తారని సమాచారం.

సొంతింటి కల టీడీపీతోనే సాధ్యం

పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



అనంతపురం అర్బన్, జూలై 31: పేదల సొంతింటి కలను సాకారం చేయడం టీడీపీకే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ కూటమి అధికారం చేపట్టేనాటికి ఖజానాలో ఒక్క పైసా కూడా లేదని, ఏ శాఖలో చూసినా అప్పుల కుప్పలే కనపడుతున్నాయని అన్నారు. ఆదాయం వచ్చేదారులు మూసుకుపోయాయని అన్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రోజే కీలకమైన ఐదు హామీల అమలు కోసం సంతకాలు చేశారని గుర్తు చేశారు. ఒక్కొక్క హామీని ఆయన నెరవేర్చుకుంటూ వెళుతున్నారని అన్నారు. అందులో భాగంగా అందరికీ గృహ నిర్మాణం నినాదంతో ప్రజల ముందుకు వచ్చారని అన్నారు. 2014లో పీఎంఏవై పథకం కింద కేంద్రం వాటా రూ.1.80 లక్షలు, రాష్ట్ర వాటా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రూ.50 వేలు, పట్టణవాసులకు రూ.లక్ష అందించి.. 12 లక్షల ఇళ్లను కట్టించి ఇచ్చారని అన్నారు. వైసీపీ హయాంలో సెంటు స్థలంతో సరిపెట్టారని, కేంద్రం సాయం రూ.1.80 లక్షలు తప్ప ఒక్క పైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. గృహ నిర్మాణాల కోసం కేంద్రం మంజూరు చేసిన రూ.5వేల కోట్లను దారి మళ్లించారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ఇళ్లు లేని పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇవ్వాలని నిర్ణయించారని తెలిపారు. ఇంటి నిర్మాణం కోసం రూ.4 లక్షలు ఇస్తామని సీఎం ప్రకటించడం పేదలకు వరమని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతోపాటు ఇళ్లు కట్టించి ఇస్తామని అన్నారు.

వైసీపీ పాలనలో హెచ్చెల్సీ నిర్వీర్యం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



తుంగభద్ర జలాలకు పూజలు నిర్వహిస్తున్న కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, జూలై 31: తుంగభద్ర ఎగువ కాలువను గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విమర్శించారు. బొమ్మనహాళ్ సరిహద్దులోని 105 కి.మీ. వద్ద హెచ్చెల్సీని బుధవారం ఆయన పరిశీలించారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండాపురం కేశవరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్రగుంట్ల వెంకటేశులు తదితరులతో కలిసి తుంగభద్ర జలాలకు పూజలు నిర్వహించి స్వాగతించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కర్ణాటకలో ఆధునికీకరణ పనులు పూర్తి కావడంతో సరిహద్దు వరకూ నీరు బాగా వస్తోందని అన్నారు. కానీ జిల్లా పరిధిలో వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయ కూడా ఖర్చు చేయలేదని అన్నారు. కాలవలో గంపెడు మట్టిని కూడా తీయలేదని, దీంతో నీటి పారుదలలో సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. అసెంబ్లీలో హెచ్చెల్సీ సమస్యను ప్రస్తావించానని, ఆధునికీకరణ పనుల గురించి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చేలా చూశానని తెలిపారు. ఈ ఏడాది హెచ్చెల్సీకి 26 టీఎంసీలకుపైగా నీరు అందుతుందని, వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచించారు. వర్షాభావం కారణంగా ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నాయని, కనీసం హెచ్చెల్సీ ఆయకట్టుకింద మంచి దిగుబడులు రావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేఈఈ అల్తాఫ్, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు గుండుమలకు సీఎం చంద్రబాబు



పింఛన్ల పంపిణీ.. ప్రజావేదిక నిర్వహణ

పుట్టపర్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్లను పంపిణీ చేసేందుకు సీఎం చంద్రబాబు మడకశిర నియోజకవర్గంలోని గుండుమల గ్రామానికి గురువారం వస్తున్నారు. నంద్యాల జిల్లా పర్యటనను ముగించుకుని హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.45 గంటలకు గుండుమలకు చేరుకుంటారు. గ్రామానికి చెందిన ఓబులమ్మ, రామన్నకు వారి ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేస్తారు. అనంతరం గ్రామం నడిబొడ్డున ప్రజావేదిక నిర్వహిస్తారు. పట్టు రైతులు, గుండుమల ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడుతారు. సీఎం పర్యటనను ప్రత్యక్షంగా వీక్షించేందుకు మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా సీఎం పర్యటన సాగనుంది.

లైన్‌మన్ నిర్లక్ష్యానికి రైతు బలి

కరెంట్ పోల్‌పై ప్రాణం విడిచిన చీనీ రైతు

నార్పల, జూలై 31: విద్యుత్ శాఖలో లైన్‌మెన్ నిర్లక్ష్యం కొనసాగుతోంది. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను పరిష్కరించడం మానేసి, రైతులచేత ఆ పనులు చేయిస్తూ, వారి ప్రాణాలను బలితీసుకుంటున్నారు. నార్పల మండలం నడిమిపల్లి గ్రామంలో చీనీ రైతు రమణారెడ్డి(55) విద్యుత్ స్తంభంపై విలవిలలాడుతూ బుధవారం ప్రాణాలు విడిచారు. రమణారెడ్డి చీనీ చెట్లను సాగుచేశాడు. రెండు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. లైన్‌మన్ షుకూర్ మరమ్మతు పనులు చేయాల్సి ఉండగా.. రైతు రమణారెడ్డిని విద్యుత్ స్తంభంపైకి ఎక్కించాడు. రైతు స్తంభంపై పనులు చేసుండగానే ఎల్‌సీ ఆన్ చేయాలని అధికారులకు లైన్‌మన్ చెప్పాడు. వెంటనే వారు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో రమణారెడ్డి కరెంటు స్తంభంపైనే మృతిచెందాడు. దీంతో లైన్‌మన్ అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. లైన్‌మన్ కోసం వెతుకుతుండగా అక్కడికి పోలీసులు చేరుకుని సర్దిచెప్పారు. లైన్‌మన్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు. రైతు రమణారెడ్డికి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.



రమణారెడ్డి (ఫైల్)

ఇక సిరికల్చరే!

- వైసీపీ పాలనలో నిర్వీర్యమైన సెరికల్చర్
- కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం
- రూ.10 కోట్ల రాయితీ నిధుల విడుదల
- మరిన్ని ప్రోత్సాహకాల కోసం రైతుల ఎదురుచూపు

అనంతపురం సెంట్రల్, జూలై 31: గత వైసీపీ ప్రభుత్వంలో ప్రోత్సాహం కరువైన పట్టుపరిశ్రమ చంద్రబాబు రాకతో కోలుకుంటోంది. గత ఐదేళ్లలో జిల్లా పట్టు రైతులకు వైసీపీ ప్రభుత్వం కోట్ల రూపాయల ప్రోత్సాహకాలు పెండింగ్‌లో పెట్టింది. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన కొద్ది రోజుల్లోనే ప్రభుత్వ రాయితీ బకాయిలు రూ. పది కోట్లు విడుదల చేశారు. దీంతో జిల్లా పట్టు రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 70వేల ఎకరాల్లో వేలాది మంది రైతులు మల్బరీ సాగుచేస్తున్నారు. ఈ సాగు ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా లక్ష కుటుంబాలకుపైగా ఉపాధిని పొందుతున్నాయి. ఈ నేపథ్యంలో మల్బరీ సాగును ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి, షెడ్ సైడ్‌వాల్స్ రేకులు, రోటోవేటర్, కట్టర్లు, విజేత పౌడర్లు తదితర వాటిని అందజేయాలని రైతులు కోరుతున్నారు. మల్బరీ సాగుకు ఆలవాలమైన మడకశిర ప్రాంతానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వస్తున్న నేపథ్యంలో పట్టు రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరుతున్నారు.

70వేల ఎకరాల్లో మల్బరీ సాగు...

ఉమ్మడి జిల్లాలో పట్టు సాగు చేసే ప్రాంతాలను బట్టి మడకశిర, హిందూపురం, కదిరి, పెనుకొండ, ధర్మవరం, కళ్యాణదుర్గం, అనంతపురం డివిజన్లుగా ఏర్పాటు చేశారు. ఒక్కో డివిజన్‌కు అడిషనల్ డైరెక్టర్(ఏడీ), సెరికల్చర్ ఆఫీసర్(ఎస్ఓ)లు ఉంటారు. వారి పరిధిలో అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్(ఏఎస్ఓ)లు, టెక్నికల్ ఆఫీసర్లు(టీఓ), అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లు(టీఓ), ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎఫ్ఏ) క్షేత్రస్థాయిలో రైతులవద్ద కెళ్లి మల్బరీ సాగుపై అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి సాగుకు అవసరమైన వసతులు, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు 70వేల ఎకరాల్లో మల్బరీ పంటను సాగుచేస్తూ 10వేల షెడ్లలో పట్టు పురుగులు పెంచుతున్నారు. రైతుల వివరాలు, సాగు విస్తీర్ణం, ప్రభుత్వ పథకాలు, రాయితీలు వంటి వివరాల క్రోడీకరణ, వాటి అమలు కార్యక్రమాలను కార్యాలయ సూపరింటెండెంట్‌తో పాటు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పరిశీలిస్తారు. పట్టుపరిశ్రమ శాఖను జాయింట్ డైరెక్టర్(జేడీ) దుగ్గిరాల పద్మమ్మ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్(డీడీఎస్) అంజనేయులు పర్యవేక్షిస్తున్నారు.

రూ.మూడు లక్షల రాయితీ



58 ఇంటు 25 చదరపు అడుగుల విస్తీర్ణంలో రేషం షెడ్డు నిర్మించుకున్నా. ఇందుకు రూ.3లక్షల రాయితీని ప్రభుత్వం చెల్లించింది. కొమ్మమేత స్టాండ్లకు రూ.3412 రాయితీ ఇచ్చారు. ఈ మొత్తం సొమ్మును నేరుగా బ్యాంకు ఖాతాకే అధికారులు జమచేశారు. సకాలంలో రాయితీలను అందజేస్తే మరింత ఉత్సాహంతో పని చేయవచ్చు.

\- ఆనందప్ప, పట్టురైతు, గుండుమల



రైతులకు పొలంలో సూచనలు ఇస్తున్న ఏడీ రామకృష్ణ

రూ.10 కోట్ల సొమ్ము జమ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మల్బరీ సాగును ప్రోత్సహిస్తున్నాయి. ఇందులో భాగంగా ప్లాంటేషన్ డ్రిప్ ఏర్పాటు, షెడ్డు నిర్మాణం, పట్టు గూళ్ల పెంపకం, అమ్మకాలు, రీలింగ్ యూనిట్ ఏర్పాటు తదితర వాటికి రాయితీలను అందిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రాయితీలను ఎత్తివేసి పట్టుపరిశ్రమను నిర్వీర్యం చేశారు. అంతేకాక కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.వందల కోట్ల నిధులను సైతం పక్కదారి మళ్లించారు. దీంతో అనేకమంది రైతులు మల్బరీ సాగును వదిలేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు పట్టు రైతుల్లోని నైరాశ్యాన్ని తుడిచివేసే చర్యలను చేపట్టారు. ఇందులో భాగంగా రూ.10కోట్ల రాయితీల బకాయి సొమ్మును పదిరోజుల కిందట విడుదల చేశారు. వాటిని నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లోకే ప్రభుత్వం జమచేసిందని పట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబుతోనే రైతులకు మేలు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పరిపాలనలోనే పట్టు రైతులకు మేలు జరుగుతోంది. సకాలంలో రాయితీలు విడుదల చేయడం, అధికారులను అప్రమత్తం చేయడం, ఎప్పటికప్పుడు సమీక్షించి లోపాలను గుర్తించడంలో ఆయన దిట్ట. సీఎం కాగానే రూ.లక్ష రాయితీని చెల్లించారు. ఇంకా సూట్, నర్సరీ బిల్లులు రావాలి.

\- అనిల్‌కుమార్, పట్టురైతు, ఓబిగానిపల్లి

ఉపాధి హామీ పథకంలో చేర్చాలి



ఐదు ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నా. మల్బరీ సాగును ఉపాధి హామీ పథకంలో చేర్చాలి. సైడ్ వాల్స్ రేకులు, రొటోవేటర్, కట్టర్లు, విజేత పౌడర్లు అందజేయాలి. గత టీడీపీ ప్రభుత్వంలో 90శాతం రాయితితో డ్రిప్ ఏర్పాటు చేశారు. వైసీపీ పాలనలో అవన్నీ ఎత్తివేశారు. మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం రావడంతో ఇస్తారని ఆశిస్తున్నాం.

\- రాఘవేంద్ర, పట్టురైతు, తెనగల్లు

సమగ్రశిక్ష ఏపీసీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

అనంతపురం విద్య, జూలై 31: సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్(ఏపీసీ)గా నాగరాజు నియమితులయ్యారు. బుధవారం ఆయన ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీసీగా అదనపు బాధ్యతలతో పనిచేస్తున్న జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి ఇటీవలే రాజంపేటకు బదిలీపై వెళ్లారు. దీంతో సుమారు వారం రోజులకుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఏపీసీ పోస్టు ఖాళీపడిన తర్వాత డీఈఓ వరలక్ష్మికి ఏపీసీగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి నా...ఆమె తీసుకోలేదని సమాచారం. దీంతో ఆఖరికి ఏడీ నాగరాజుకు జిల్లా కలెక్టర్ ఏపీసీగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సమగ్రశిక్ష ప్రాజెక్టులోని సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిభకు వందనం

అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన వందన



జాతీయ పతాకంతో వందన

ఉరవకొండ, జూలై 31: అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో విడపనకల్లుకు చెందిన ఎం వందన సీనియర్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఫస్ట్ ఓపెన్ ఇంటర్నేషనల్ గేమ్స్, నింజా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భూటాన్‌లో అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలు ఈ నెల 26నుంచి 28 వరకూ జరిగాయి. భూటాన్‌కు చెందిన బాక్సర్ నస్రీన్‌తో జరిగిన పోటీల్లో వందన ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించింది. ఈమె ఒకటి నుంచి 10 వరకు విడపనకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించింది. ఇంటర్, డిగ్రీ ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో బాక్సింగ్‌లో రాణించింది. 2016 నుంచి అనంతపురంలోని బాక్సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్డీటీలో శిక్షణ పొందింది. ఢిల్లీలో రెండుసార్లు గోల్డ్ మెడల్ సాధించింది. రాష్ట్రస్థాయిలో ఆరు సార్లు గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. వందన విజయం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చీనీ టన్ను రూ.17వేలు



అనంతపురం రూరల్, జూలై 31: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలు, కనిష్ఠంగా రూ.2,500లు, సరాసరి రూ.11,500లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 785టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పే ఆర్డర్లను ఏర్పాటు చేయాలి

- డీఆర్ఎంకు ఏఐఆర్ఆర్ఎఫ్ వినతి

గుంతకల్లు, జూలై 31: రైల్వే విశ్రాంత ఉద్యోగులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు ఏడో వేతన సంఘం సిఫారసుల మేరకు ఇవ్వాల్సిన పెన్షన్ పే ఆర్డర్లను వెంటనే ఏర్పాటు చేయాలంటూ ఆలిండియా రిటైర్డు రైల్వేమెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ ఆర్ఎఫ్) నాయకులు డీఆర్ఎంను కోరారు. ఏఐఆర్ఆర్ఎఫ్ కార్యాలయంలో బుధవారం ఉదయం రైల్వే పింఛనుదారుల డివిజనల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సదస్సులో ఈ సంఘ జోనల్ అధ్యక్షుడు ఎస్ శ్రీధర్, జోనల్ కార్యదర్శి యుగంధర్ మాట్లాడుతూ సెకెండరీ ఫ్యామిలీ పెన్షన్లను వెంటనే ఏర్పాటు చేయాలని, యూఎంఐడీ మెడికల్ కార్డులు లేనివారికి వెంటనే కార్డులను జారీ చేయాలని, పింఛనుదారులందరికీ మాన్యువల్ పాసులను యాజమాన్యం జారీ చేయాలని, రెఫరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం పింఛను దారుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ డివిజనల్ రైల్వే మేనేజరు విజయ కుమార్, సీనియర్ డివిజనల్ పర్సనల్ మేనేజరు జయశంకర్ చౌహాన్‌ను కలిసి వినతిపత్రాలను అందజేశారు. రైల్వే పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని డీఆర్ఎం హామీ ఇచ్చినట్లు ఈ సంఘ నాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐఆర్ఆర్ ఎఫ్ గుంతకల్లు రైల్వే డివిజన్ అధ్యక్షుడు జయంత్ కుమార్, కార్యదర్శి వీ సుంకప్ప, అదనపు డివిజనల్ కార్యదర్శి సత్యరాజ్, వివిధ రైల్వే బ్రాంచ్‌ల చైర్మన్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



డీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఆర్ఆర్ఎఫ్ నాయకులు

తహసీల్దార్ల పోస్టింగ్‌కు తాత్కాలిక బ్రేక్

అనంతపురం టౌన్, జూలై 31: తహసీల్దార్ల పోస్టింగ్‌లకు తాత్కాలిక బ్రేక్ పడింది. ప్రభుత్వం కొత్త నిబంధనల మేరకు పోస్టింగ్‌లు ఇవ్వాలని కలెక్టర్లకు రెవెన్యూశాఖ కమిషనర్ నుంచి మంగళవారం రాత్రి ఆదేశాలు వచ్చినట్లు కలెక్టరేట్ వర్గాల సమాచారం. కొత్త నిబంధనల ప్రకారం ప్రస్తుతం అనంత జిల్లా, శ్రీసత్యసాయిజిల్లాకు వచ్చిన తహసీల్దార్లందరికీ ఉమ్మడి అనంతపురం జిల్లాను యూనిట్‌గా తీసుకొని పోస్టింగ్ ఇవ్వాల్సి ఉన్నట్లు తెలిసింది. అనంత జిల్లాకు చెందిన 35మందికి బుధవారం పోస్టింగ్ ఇవ్వడానికి కలెక్టరు మంగళవారం రాత్రికి ప్రక్రియ పూర్తి చేశారు. అయితే కొత్తగా ఉమ్మడి జిల్లా యూనిట్‌గా పోస్టింగ్ ఇవ్వాలని ఆదేశాలు రావడంతో ఆప్రక్రియ ఆగిపోయిందని చెబుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం అనంత జిల్లాకు 35మంది, శ్రీసత్యసాయి జిల్లాకు 23మంది తహసీల్దార్లు తిరిగి చేరుకున్నారు. అనంతజిల్లాలో 31మండలాలు, శ్రీసత్యసాయి జిల్లాలో 32మండలాలు ఉన్నాయి. రెండుజిల్లాలకు కలిపి 58మంది మాత్రమే ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోనే 10మంది తహసీల్దార్లకు పోస్టులు ఖాళీగా ఉన్నాయంటున్నారు. ఇపుడు వచ్చిన తహసీల్దార్లను ఎన్నికలకు ముందు ఏజిల్లాలో, ఏ నియోజక వర్గంలో పనిచేశారో అక్కడ నియమించకూడదని, అలాగే సొంత రెవెన్యూ డివిజన్‌లో కూడా నియమించకూడదనే నిబంధన తప్పకుండా పాటించాలని రెవెన్యూ కమిషనర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇపుడు వచ్చిన 58మందిని ఉమ్మడి జిల్లాఅనంతను యూనిట్‌గా తీసుకొని 63మండలాలలో పోస్టింగ్ ఇవ్వనున్నారు.

ఈప్రక్రియ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు కలిసి నిర్వహించాల్సి ఉందని రెవెన్యూ వర్గాలు అంటున్నాయి. సీఎం చంద్రబాబు గురువారం శ్రీ సత్యసాయి జిల్లాకొస్తున్నారు. దీంతో ఆ జిల్లా కలెక్టరు ఆకార్యక్రమం ముగిసేవరకు ఈతహసీల్దార్ల వ్యవహారం గురించి పట్టించుకో వడం కష్టం. శుక్ర లేదా శనివారం తహసీల్దర్ల పోస్టింగ్‌లపై ఇద్దరు కలెక్టర్లు మాట్లాడుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదే జరిగితే శనివారం లేదంటే వచ్చే సోమవారం రోజుకి తహసీల్దార్ల పోస్టింగ్‌లపై అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అసైన్డ్‌పై విచారణ జరిపించాలి: సీపీఎం

అనంతపురం కల్చరల్, జూలై 31: అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై సమగ్ర విచారణ జరిపించి, కబ్జాదారులను కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం హడావుడిగా తెచ్చిన జీఓ. నెం.596 భూ చట్ట సవరణ పేదల భూములను పెద్దలు కబ్జా చేసేందుకు తోడ్పడిందని విమర్శించారు. భూ చట్ట సవరణ ప్రకారం 20 ఏళ్లకు పైగా అసైన్డ్ భూములు సాగుచేసుకుంటున్న పేదలకు శాశ్వత భూ హక్కు కల్పిస్తామని నాడు వైసీపీ నేతలు చెప్పారన్నారు. అసైన్డ్ భూములను సాగు చేసుకోవాల్సిన దళిత, గిరిజనులను తరిమేసేందుకు రాజకీయ నాయకులకు ఈ చట్ట సవరణ ఉపయోగపడిందని తెలిపారు. అనంతపురం జిల్లాలో 2.23లక్షల ఎకరాల అసైన్డ్ భూములను దళిత, గిరిజన, బలహీన వర్గాల వారు మాత్రమే సాగు చేసుకోవాల్సి ఉందని, కానీ ఆపేదల భూములను గతం నుండి అక్రమంగా అనేక రూపాల్లో పెత్తందార్లు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ అక్రమాలను చట్టబద్ధం చేసుకునేందుకే గత సంవత్సరం చివర్లో వైసీపీ ప్రభుత్వం జీఓ తెచ్చిందని పేర్కొన్నారు. భూచట్ట సవరణను ఉపయోగించుకుని జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో దాదాపు 24వేల ఎకరాల అసైన్డ్ భూములను నాటి అధికారపార్టీ నాయకులు, గ్రామ పెత్తందారులు తమ పేర్లమీదకు మార్చుకున్నట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జూలై 31: సమగ్రశిక్ష ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం ప్రకటనలో కోరారు. సమగ్రశిక్షలోని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ), గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీఓ), అసిస్టెంట్ ఏఎంఓ (జనరల్), అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ),అసిస్టెంట్ అలెస్కో, అసిస్టెంట్ సీఎంఓ, అసిస్టెంట్ ఐఈడీ, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టుకు అర్హత గల స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరకాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న స్కూల్ అసిస్టెంట్లు తమ దరకాస్తులతోపాటు విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు, సర్వీసు పుస్తకం జిరాక్స్ కాపీలు జత చేయాలన్నారు. ఏఎంఓ, జీసీడీఓ(మహిళా అభ్యర్థులు మాత్రమే) పోస్టులకు 8 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకొన్న వారు అర్హులన్నారు. ఇతర పోస్టులకు 5 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారు అర్హులని తెలిపారు. దరకాస్తులను http://samagrashikshaatpblogspot.com నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి ఆగస్టు 9 సాయంత్రం 5 గంటలలోగా సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు గుత్తి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం

గుత్తి, జూలై 31: గుత్తి ఆర్ఎస్‌లోని సెయింట్ మేరీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు విక్టర్, మనోజ్ భారత క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రిజినా, హెచ్ఎం ఎల్ఈల్ హర్షి తెలిపారు. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన కానిస్టేబుల్ బొజ్జప్ప కుమారుడు విక్టర్, బెల్దారీ సురేష్ కుమారుడు మనోజ్ ఈ ఏడాది మార్చిలో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా క్రికెట్ పోటీల్లో ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఏప్రిల్30 హైదరాబాదులో జరిగిన జాతీయ స్థాయి క్రికెట్ పోటీలో రాణించి భారతజట్టుకు ఎంపికయ్యారు. నేపాల్‌లో ఈనెల 3నుంచి 6 వరకు జరిగే అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

మళ్లీ పెరిగిన వరద

- టీబీ డ్యాం 33 గేట్లు ఎత్తివేత
- 74,095 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



డ్యాం నుంచి దిగువకు వెళ్తున్న వరద జలాలు

బొమ్మనహాళ్, జూలై 31: తుంగభద్ర జలాశయానికి మళ్లీ వరద పోటెత్తుతోంది. దీంతో 33 క్రస్టుగేట్లు (25 గేట్లు మూడు అడుగులు, మరో 8 గేట్లు ఒక్క అడుగు మేర)ను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. 1,23,381 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదికి, 9379 క్యూసెక్కులను కాలువలకు విడుదల చేశారు. జలాశయం పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆ వరదనీరు వచ్చి జలాశయంలోకి చేరుతున్నాయి. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 74,095 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో కాలువలకు వదిలే నీటితో కలిపి 1,32,760 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 105 టీఎంసీలు ఉండగా బుధవారం సాయంత్రానికి 1631.30 అడుగులతో 99.040 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగిలిన నీటిని బోర్డు అధికారులు దిగువకు వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 కి.మీ. వద్ద 1138 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

వేతనాల కోసం పెన్నా కార్మికుల ధర్నా



రోడ్డుకు సైకిళ్లు అడ్డం పెట్టి ఫ్యాక్టరీ వద్ద కార్మికుల నిరసన

యాడికి, జూలై 31: వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ బోయరెడ్డిపల్లి గ్రామం వద్ద ఉన్న పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు బుధవారం ధర్నా చేపట్టారు. పలువురు కార్మికులు మాట్లాడుతూ పెన్నాసిమెంట్ ఫ్యాక్టరీ అధికారులు మూడునెలలుగా తమకు వేతనాలు చెల్లించలేదన్నారు. వేతనాలు ఇస్తే గానీ జీవనం గడవని తమకు వేతనాలు చెల్లించకుండా ఫ్యాక్టరీ అధికారులు తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారన్నారు. పెన్నాసిమెంట్స్ ఫ్యాక్టరీ ప్రధాన గేటును మూసివేసి, ఫ్యాక్టరీకి వెళ్లేదారిలో సైకిళ్లను అడ్డుపెట్టి ధర్నా నిర్వహించారు. ఫ్యాక్టరీ ఉద్యోగులు ఎవరూ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. తమకు వేతనాలు చెల్లించేదాకా విధులకు వెళ్లేదిలేదని, ఉద్యోగులను ఎవరిని లోపలికి వెళ్లనివ్వమని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు పెన్నాసిమెంట్స్ ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి అధికారులు, కార్మికులతో వివరాలు ఆరాతీశారు. కార్మికులకు సర్దిచెప్పే ప్రయత్నాలు చేశారు. తమకు రావాల్సిన బకాయిలు మొత్తం చెల్లించేదాకా ధర్నాను కొనసాగిస్తామని కార్మికులు తెలిపారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్‌అదాలత్

అనంతపురం క్రైం, జూలై 31: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా కోర్టుల పరిధిలోని అన్ని రకాల కోర్టులలో పెండింగ్‌లో ఉన్న మోటారు వాహనాల ప్రమాద కేసులు, సివిల్, చెక్ బౌన్సు కేసులు, కుటుంబ తగాదాలు(విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారన్నారు. సంబంధిత కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాలో డీఎస్పీల బదిలీ

అనంతపురం క్రైం, జూలై 31: ఉమ్మడి జిల్లాల పరిధిలో పలువురు డీఎస్పీల బదిలీ అయ్యారు. అనంతపురం పీటీసీ డీఎస్పీ కదలి వెంకటేశ్వరరావు ను తూర్పు గోదావరి దిశ మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. రాష్ట్రవ్యాప్తం గా 96మంది డీఎస్పీలను ప్రభుత్వం బుధవారం బదిలీ చేసింది. 14వ బెటాలి యన్ డీఎస్పీ దామోదర్‌రావును విజయవాడ సెంట్రల్ ఏసీపీగా బదిలీ చేశారు. అప్పా ఆటాచ్డ్ పీటీసీ డీఎస్పీ హుస్సేన్‌పీరాను జమ్మలమడుగు డీఎస్పీగా బదిలీ చేశారు. జిల్లాలోని గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డిని, కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్, పెనుకొండ డీఎస్పీ బాజీజాన్ సైదా పోలీస్‌హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు ఎస్పీ, అటాచ్డ్ నెల్లూరు ట్రాఫిక్ డీఎస్పీ ఆళ్ల శ్రీనివాసులును పెనుకొండ డీఎస్పీగా నియమించారు. గుంతకల్లు, కళ్యాణదుర్గం, పుట్టపర్తి డీఎస్పీలుగా ఇంకా ఎవరినీ నియమించలేదు. రెండో జాబితాలో మరింత మంది డీఎస్పీల బదిలీలు జరగనున్నాయి.

అమ్మపాలే అమృతం

అనంతపురం టౌన్, జూలై 31: తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవి. తల్లిపాలు తాగే చిన్నారుల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుంది. అయితే పలు కారణాల వల్ల శిశువులకు తల్లిపాలు అందడం లేదు. దీంతో నవజాత శిశువులు అనారోగ్యాలబారిన పడుతున్నారు. మరి కొందరు మరణిస్తున్నారు. అనంతజిల్లాలో వైద్యశాఖ లెక్కల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో కలిపి ఏటా 55వేల మంది తల్లులు బిడ్డలకు జన్మనిస్తున్నారు. అందుకే ప్రభుత్వాలు తల్లిపాల ఉపయోగాల గురించి అవగాహన కల్పిస్తున్నాయి. ప్రతి ఏటా ఆగస్టు 1 నుంచి వారం రోజుల పాటు తల్లి పాలు వారోత్సవాలు నిర్వహిస్తూ బిడ్డకు తల్లిపాల ఆవశ్యకత గురించి తెలియజేస్తున్నాయి.



తల్లి పాల వారోత్సవాల సందర్భంగా కలెక్టరు ఏర్పాటు చేయించిన పోస్టర్

ముర్రుపాలు ఎంతో మేలు

ఏ తల్లి అయినా ప్రసవించిన(సాధారణ కాన్పు, లేదా సిజేరియన్ అయినా) గంటకు తప్పనిసరిగా బిడ్డకు పాలు పట్టించాలి. తొలి మూడు రోజుల పాటు తల్లి నుంచి వచ్చే పాలు పసుపు రంగులో ఉంటాయని వీటినే ముర్రుపాలు అంటారని వైద్యులు చెబుతున్నారు. ఈ పాలలో ఇమ్యునోగ్లోబిన్స్ అధికంగా ఉంటాయని, వీటిని తాగించడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొంటున్నారు. తల్లి దగ్గర బిడ్డ ఎంత ఎక్కువ తాగితే అంత ఎక్కువగా పాలు ఉత్పత్తి పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఇద్దరికీ ప్రయోజనమే..

తల్లిపాలు బిడ్డకు పట్టించడం వల్ల ఇద్దరికీ మేలు జరుగుతుందని చెబుతున్నారు. బిడ్డకు సరైన పోషకాహారం లభించి, సులువుగా జీర్ణమవుతుంది. రోగ నిరోధకశక్తి పెరుగుతుంది, అలర్జీ ప్రభావాలు తగ్గుతాయి. మానసిక వికాసం జరుగుతుంది. అలాగే తల్లికి కూడా పలు ప్రయోజనాలు కలుగుతాయి. ప్రసవం నొప్పుల నుంచి త్వరగా కోలుకుంటారు. త్వరగా బరువు తగ్గుతారు. తల్లీబిడ్డల మధ్య బంధం దృఢమవుతుంది. తల్లులకు కేన్సర్, మూత్రపిండాల జబ్బులు వంటివి వచ్చే ప్రమాదాలు దూరమవుతాయి.

పౌష్టికాహార లోపంతోనే...



తల్లులు సరైన ఆహారం తీసుకోకపోతే ఆ ప్రభావం పిల్లలపై పడుతుంది. ఆస్పత్రికి ప్రసవాలకు వస్తున్న చాలామంది తల్లులు బలహీనత, రక్తహీనతతో వస్తున్నారు. అలాంటి వారికి పుట్టే పిల్లలు చాలా బరువు తక్కువతో అనారోగ్యంగా పుడుతున్నారు. అలాంటి పిల్లలను ఎస్ఎన్‌సీ యూ(స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్)లో ఉంచి వైద్యసేవలు అందిస్తున్నాం, అయినా చాలామంది పిల్లలు త్వరగా కోలుకోవడంలేదు. అందుకే గర్భం దాల్చినప్పటి నుంచే పౌష్టికాహారం తీసుకోవాలి. మామూలు సమయంలో కంటే గర్భిణిగా ఉన్నప్పుడు 10నుంచి 12కేజీల అదనపు బరువు పెరగాలి. అప్పుడే కడుపులో ఉన్నబిడ్డ ఎదుగుదల బాగున్నట్లు గుర్తించాలి.

\- డాక్టర్ రవికుమార్, చిన్నపిల్లల విభాగాధిపతి, జిల్లా ఆస్పత్రి

నవజాత శిశువుకు శ్రేయస్కరం: వైద్యులు
నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు


అవగాహన పెంపునకే...



తల్లి పాల విశిష్టతను తల్లులకు తెలిపి వారిలో అవగాహన కల్పించడం కోసమే తల్లిపాలు వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. తల్లి పాలు పట్టించడంలో ఇప్పటికీ అపోహలు ఉన్నాయి. తొలి మూడురోజులు వచ్చే ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం. బాలింతలు నీళ్ల ఎక్కువ తాగరాదనే అపోహ కూడా ఉంది. ఇది సరైంది కాదు. ప్రతి రోజు కనీసం మూడు లీటర్ల నీరు తాగాలి. ఒకలీటర్ పాలు తీసుకోవాలి. అపుడు తగినంత పాలు పిల్లలకు అందుతాయి. బాలింతలు అన్నిరకాల ఆహార పదార్థాలు తీసుకోవచ్చు. గురువారం నుంచి వారంపాటు అంగన్‌వాడీలు ఇతరులతో కలిసి జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

\- డాక్టర్ ఈబీ దేవి, డీఎం హెచ్ఓ

జాగ్రత్తలు పాటించాలి



తల్లికి పాలు ఇవ్వడం ఎంత ముఖ్యమో, ఆపిల్లలకు పాలిచ్చే విధానం కూడా అంతే ముఖ్యం. కూర్చొని బిడ్డకు పాలు పట్టించాలి. పాలు తాగినవెంటనే పిల్లలను పడుకోబెట్టకూడదు. కొద్దిసేపు భుజంపై వేసుకొని తట్టాలి. త్రేన్పులు వచ్చిన తర్వాత పడుకోబెట్టాలి. అపుడు ఎలాంటి ప్రమాదం ఉండదు. పాలను ఇష్టానుసారం తాపించి, వెంటనే ఊయలలో పడుకోబెడితే పిల్లల నోట్లోకి, ముక్కుల్లోకి పాలువచ్చి పొలమారుతుంది. ఆదేసమయంలో ఊపిరితిత్తుల్లోకి వెళ్లి ఊపిరి ఆడక ప్రాణాలు పోయే అవకాశాలు ఉంటాయి.

\- డాక్టర్ హేమలత, డిప్యూటీ ఆర్ఎంఓ, జీజీహెచ్

అండర్ డ్రైనేజీకి నిధులు మంజూరు చేయండి

● పార్లమెంట్‌లో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, జూలై 31: అనంత జిల్లా కేంద్రంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ సమావేశంలో స్పీకర్ ద్వారా కేంద్రమంత్రికి ఎంపీ ఈ విషయాన్ని విన్నవించారు. అమృత్ 2.0 మిషన్‌లో భారత్‌లోని ఎంపిక చేసిన పట్టణాల్లో వంద శాతం మురుగునీరు నిర్వహణను అందించడం, పట్టణ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు దూరదృష్టితో స్థాపించారన్నారు. ప్రతిష్టాత్మక దృక్పథం ఉన్నప్పటికీ అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో దుర్భర పరిస్థితిలో ఉందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో నీటి ద్వారా వచ్చే వ్యాధులు, సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మురుగునీటి శుద్ధిప్లాంట్లతో అనంతలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు వేగవంతం చేయాలని కోరారు.

బోడమల్లయ్యస్వామి ఆలయానికి రోడ్డు వేయిస్తాం



రహదారి కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ధర్మవరపు మురళి

రాప్తాడు, జూలై 31: మండలంలోని గొల్లపల్లి పీఏబీఆర్ కుడి కాలువ వద్ద నుంచి బోడమల్లయ్యస్వామి ఆలయం వరకూ రోడ్డు నిర్మిస్తామని టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి తెలిపారు. బుధవారం టీడీపీ నాయకులతో కలిసి బోడమల్లయ్యస్వామి ఆలయ దారిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి వెళ్లేదారి చాలా అధ్వానంగా ఉందని, ఎన్నికల ప్రచార సమయంలో గొల్లపల్లి గ్రామస్థులు పరిటాల సునీతను కోరారు. టీడీపీ అధికారంలోకి రావడంతో గ్రామస్థులకు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు వేయిస్తామన్నారు. కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాము, గంగాధర్ పాల్గొన్నారు.

అండర్-19 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 31: జిల్లా అండర్-19 క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన జట్టు వివరాలను బుధవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి వెల్లడించారు. వీరారెడ్డి (కెప్టెన్), ప్రదీప్‌రెడ్డి (వైస్‌కెప్టెన్), భార్గవ్‌రాజు, వెంకట్‌లోకేష్, సాయిప్రతాప్ రెడ్డి, మనోజ్, జయంత్‌కృష్ణ, తన్వీర్‌జమాల్, నీలేంద్ర, ప్రశాంత్, హర్షవర్ధన్, మణిదీప్, విగ్నేష్, దినకర్, షేక్‌సాహిల్, నిశ్చయ్, భువనేశ్వర్ ఎంపిక కాగా స్టాండ్‌బైలుగా చెన్నకేశవరెడ్డి, చంద్రశేఖర్, సందీప్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి ఎంపికయ్యారు. మేనేజర్‌గా అశోక్ నియమితులయ్యారు. ఆగస్టు 1 నుంచి నరసరావుపేటలో ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-19 మల్టీడే క్రికెట్ పోటీలకు జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు.

కౌలుకు 44.83 ఎకరాల మాన్యం భూములు

అనంతపురం కల్చరల్, జూలై 31: ఉప్పరపల్లి గ్రామపరిధిలోని చంద్రశేఖరస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాలకు సంబంధించిన 44.83 ఎకరాల మాన్యం భూములను కౌలుకు దక్కించుకున్నారు. భూముల కౌలుకు సంబంధించి బుధవారం జిల్లా కేంద్రంలో మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ కల్యాణమండపంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ సమక్షంలో ఈఓ. రామాంజనేయులు అధ్యక్షతన బహిరంగ వేలం ప్రక్రియ నిర్వహించారు. దాదాపు 50 మంది ఈ వేలం ప్రక్రియలో పాల్గొన్నారు. మొత్తం 15 మంది ఏడాదికి రూ.95,200 చొప్పున మూడు సంవత్సరాల కౌలుకు దక్కించుకున్నారు.

ఎమ్మార్సీకి తగ్గిన విద్యుత్ బిల్లు

గార్లదిన్నె, జూలై 31: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి జూలై నెలలో వచ్చిన రూ.98వేలును ఎట్టకేలకు విద్యుత్‌శాఖ అధికారులు తగ్గించారు. రెండురోజుల క్రితం వామ్మో కరెంట్ బిల్లు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు గార్లదిన్నె ఎమ్మార్సీ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో వచ్చిన రూ.98వేలు విద్యుత్ బిల్లును పరిశీలించారు. కార్యాలయానికి వచ్చింది రూ.460 అని మండల విద్యాశాఖ అధికారి తారా చంద్రానాయక్‌కు తెలియజేశారు. దీంతో ఆయన బిల్లును చెల్లించారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోండి

రామగిరి, జూలై 31: మండలంలోని గరిమేకలపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం నరసింహులుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ. శ్రీనివాసులుకు బుధవారం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఎంఈఓ. పాఠశాల తనిఖీకి వెళ్లినప్పుడు గ్రామస్థులు ఆయనను కలిసి హెచ్‌ఎం ప్రవర్తనపై ఫిర్యాదు చేశారు. నాడు-నేడు పనులు, గ్రామస్థులపై అసభ్యకరంగా ప్రవర్తించారని అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని గోపాల్, మారుతీప్రసాద్, నారాయణ, శేషు రాధాకృష్ణ, రామ్మూర్తి, గోవిందరెడ్డి పేర్కొన్నారు.

గూగూడు కుళ్లాయిస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

నార్పల, జూలై 31: ప్రసిద్ధిగాంచిన గూగూడు కుళ్లాయిస్వామికి భక్తులు సమర్పించిన హుండీలను బుధవారం ఆలయంలో లెక్కించారు. రూ.37.27 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ. శోభ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము ఇవ్వడం లేదు

బ్యాంకు వద్ద లబ్ధిదారుల నిరసన



బ్యాంకు వద్ద పింఛన్‌దారులు నాగయ్య, ముత్యాలమ్మ

శింగనమల, జూలై 31: అనారోగ్యంతో బాధపడుతున్న తమకు పింఛను సొమ్ము ఇప్పించాలని సలకం చెరువు బ్యాంకు ఎదుట బుధవారం రోగులు, వృద్ధులు నిరసన తెలిపారు. ఏప్రిల్, మే నెలలకు సంబంధించి సలకంచెరువు స్టేట్ బ్యాంకులో తమ ఖాతాలో డబ్బు జమ అయిందని, బ్యాంకు వారు మీ పాత బకాయికి జమ చేసుకున్నామని చెబుతున్నారని రోగులు బిందెల నాగయ్య, ముత్యాలమ్మ, పింఛనదారులు లాల్‌మునెమ్మ, పెద్దక్క ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పింఛనుదారులందరికీ పింఛన్ వచ్చేవిధంగా చర్యలు చేపడతామని బ్యాంకు మేనేజర్ బాలచంద్ర హామీ ఇచ్చారు.

బాధ్యతలు చేపట్టిన డీఈఈలు



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఈఈ శ్రీనివాసులు

అనంతపురం రూరల్, జూలై 31: విద్యుత్ శాఖలో డీఈఈలుగా శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఏపీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో డీఈఈగా పనిచేస్తున్న శ్రీనివాసులు ఇటీవల బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు అనంతపురం టౌన్-2 డివిజన్ డీఈఈగా పోస్టింగ్ ఇచ్చారు. బుధవారం పవర్ ఆఫీస్‌లో తిరుపతి సీజీఎం వరకుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో టౌన్-1 డీఈఈగా పనిచేశారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న డీఈఈ లక్ష్మీనారాయణను టౌన్-1 డీఈఈగా నియమించారు. ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అదేవిధంగా టౌన్-1 డీఈఈగా పనిచేస్తున్న నాగేంద్రను నంద్యాల జిల్లా డోన్ టౌన్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈఈలకు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులను కించపరిచేలా మాట్లాడవద్దు

● విద్యుత్‌శాఖ అధికారులపై ఎమ్మెల్యే అసహనం



విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జూలై 31: రైతులను కించపరిచేలా అధికారులు మాట్లాడితే సహించేది లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామమైన వెంకటాపురంలో రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, ఆత్మకూరు వెస్ట్ ఏడీ తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కొన్నినెలలుగా విద్యుత్ పరంగా ఎదురవుతున్న సమస్యల గురించి రైతులు పెద్దఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారని, అయినా దీనిపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. చాలామంది రైతులు విద్యుత్ ప్రమాదాల వల్ల మృత్యువాత పడుతున్నారని, దీనిపై దృష్టిసారించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డబ్బులు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా ఎందుకు మంజూరు చేయలేదని ఆరాతీశారు. వైసీపీ నాయకులకు అడిగిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. రైతుల విషయంలో రాజకీయాలు ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలు ఎక్కడున్నా వెంటనేస్పందించాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో సీనియార్టీ ప్రాతిపదికన వెంటనే మంజూరు చేయాలన్నారు. సమావేశంలో సీకేపల్లి ఏడీ నాగేంద్ర, వెస్ట్ ఏడీ రవిశంకర్, రామగిరి ఏఈ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు ఏఈ దాసు, ఎల్ఎంలు పరమేశ్వర, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే పాఠశాల తనిఖీ: మండలంలోని నసనకోట సమీపంలో ఉన్న మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత బుధవారం తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనంచేశారు. పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో కలిసి తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలకు పంపిణీచేసే సరుకులు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరల నాణ్యతను ఆమె పరిశీలించారు. భోజనశాల, తరగతి గదుల్లో పారిశుధ్య పరిస్థితులను చూసి సిబ్బందికిసూచనలు చేశారు. విద్యార్థినులకు అందించే భోజన నాణ్యతను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇంకా పరిస్థితి మెరుగుపడాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై ఆరాతీశారు. పాఠశాల అభివృద్ధికి, కావాల్సిన అవసరాలను వినియోగించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఎంతోమందికి ఉపయోగపడేలా గురుకుల పాఠశాలను తీసుకువస్తామన్నారు.



విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

లక్ష మొక్కలు నాటి సంరక్షించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



నీరు-ప్రగతి పార్కులో మొక్కనాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జూలై 31: అనంతపురం నగరంలో లక్ష మొక్కలు నాటడంతోపాటు సంరక్షించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక నీరు-ప్రగతి పార్కులో గ్రీన్ ఆర్మీ నిర్వాహకుడు అనిల్ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మున్సిపల్ ఆర్డీ మూర్తితో కలిసి ఎమ్మెల్యే పార్కులో మొక్కలు నాటారు. అనంతరం పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. కరోనా సమయంలో ఆక్సిజన్ అందక అనేక మంది చనిపోయారని, ఇలాంటి విపత్తులు చూసైనా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు రాజారావు, గంగారామ్, గోళ్ల సుధాకర్ నాయుడు, కూచి హరి, రాయల్ మురళీ పాల్గొన్నారు.

అనంత క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పా: అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా అనంతపురం క్లబ్‌ను అభివృద్ధి కృషి చేస్తానని తాను చెప్పానని, పేకాట నిర్వహణకు కాదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పేకాట శిబిరాలు ఏర్పాటు చేసి ధనం సంపాదించాలనే కర్మ తనకు పట్టలేదన్నారు. క్లబ్‌లో సభ్యుల అభ్యర్థన మేరకు వ్యాయామ పరికరాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం కావాల్సిన పరికరాల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పానన్నారు. కొంత మంది తనపై అనవసరంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇప్పటికైనా అలాంటి సంస్కృతికి స్వస్తి చెప్పాలన్నారు.

నేడు పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే హాజరు: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో గురువారం నిర్వహించే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హాజరుకానున్నారు. ఉదయం 6 గంటలకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వెనుక ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరిగే పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొంటారు.

ప్రజాసమస్యలపై తక్షణం స్పందించాలి

అనంతపురంరూరల్: ప్రజా సమస్యలపై తక్షణ స్పందన ఉండాలని పంచాయతీ, సచివాలయ అధికారులకు, ఉద్యోగులకు సూచించారు. బుధవారం మండలంలోని రాజీవ్‌కాలనీ పంచాయతీ ప్రధాన సచివాలయంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పలువురు స్థానికులు డ్రైనేజీ, చెత్త, తాగునీరు, డంపింగ్ యార్డు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. వారితో ఆయన స్వయంగా మాట్లాడి సమస్యల పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కనులపండువగా గిరిజా కల్యాణం

● ముగిసిన రామకృష్ణ సేవాసమితి వార్షికోత్సవం



గిరిజా కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

అనంతపురం కల్చరల్, జూలై 31: రామకృష్ణ సేవాసమితి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం మూడవ రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాల్‌లో సాయిట్రస్టు ఆధ్వర్యంలో గిరిజా కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. రామకృష్ణ సేవాసమితి 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 27 నుంచి నిర్వహిస్తున్న వేడుకలు బుధవారం ముగిశాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ పర్యవేక్షణలో శ్రీశైలం, అలంపూర్ శక్తిపీఠాలనుంచి రుగ్వేదం పఠిస్తూ తీసుకువచ్చిన ద్వాదశ లింగాలకు రుత్వికుల వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ముత్తైదువలు తమ ఇళ్ల నుంచి తీసుకువచ్చిన సారె, ఒడిబియ్యంను అమ్మవారికి సమర్పించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం శ్రీనృత్యకళానిలయం నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి బృందం శివపదంకు నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. అనంతరం సామవేదం షణ్ముఖశర్మ భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ శ్రీకృష్ణశశి, కార్యదర్శి ప్రవీణ్, సహాయ కార్యదర్శి శ్రీధరమూర్తి, వేణుగోపాల్, సంధ్యామూర్తి, శ్రీనిధి రఘు, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, శ్రీవల్లి పాల్గొన్నారు.



అనుగ్రహభాషణం చేస్తున్న సామవేదం షణ్ముఖశర్మ



శివపదం నృత్యరూపకం

జలధికి తరలిన పీర్లు



నగరంలో ఊరేగుతున్న పీర్లు

అనంతపురం కల్చరల్, జూలై 31: జిల్లాకేంద్రంలోని వేణుగోపాల్ నగర్ 80 అడుగులరోడ్డులో నిర్వహిస్తున్న చిన్నపీర్ల పండుగ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పీర్లు జలధికి తరలాయి. బీబీ ఫాతిమా, అల్లావలి, అంగార్‌వలి, ఇమామ్ హసేన్ పీర్లను పురవీధుల్లో ఊరేగించి అగ్నిగుండ ప్రవేశం చేయించారు. అనంతరం భక్తులు పెద్దఎత్తున హాజరై చక్కెర చదివింపులు చేశారు. ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు జెబీవుల్లాఖాన్, కార్యదర్శి మొహమ్మద్ రఫీ, కోశాధికారి వెంకటేష్, మాధవ, అంజి, నగేష్, మోహన, రమేష్, వెంకటేష్, మురళి, గోపి తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: మండలంలోని సి.బండమీదపల్లి గ్రామంలో చిన్నపీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. బుధవారం పీర్లను జలధికి తరలించారు. మంగళవారం రాత్రి అగ్నిగుండాలు వెలగించారు. తెల్లవారజామున, సాయంత్రం పీర్లుస్వాములను గ్రామంలో ఊరేగించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో పెద్దమ్మతల్లి

అనంతపురం రూరల్, జూలై 31: మండలంలోని కొడిమి పంచాయతీ జ్యోతిబసు కాలనీలో వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని కాలనీ వాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠించి బుధవారానికి మూడేళ్లు కావడంతో కాలనీ పెద్దల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. పెద్దమ్మ తల్లిని ప్రత్యేక అలంకరణ నిర్వహించి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలి

ధర్మవరం రూరల్(కనగానపల్లి), జూలై 31: అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని అంగన్‌వాడీలు తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు లక్ష్మీదేవి, అ మూల్యా, అంబుజాక్షి, రమాదేవి, వనిత తహసీల్దార్‌ను కలిసి పలుచోట్ల అంగన్‌వాడీలను వేధిస్తున్నారని, ఓడీసీ ప్రాజెక్టు పరిధిలో వీరప్పగారిపల్లిలో అంగన్‌వాడీ ఆత్మహత్యయత్నానికి రాజకీయ వేధింపులే కారణమన్నారు.

చెన్నేకొత్తపల్లి: అంగన్‌వాడీ వర్కర్ నాగమణి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన అంజనేయులును వెంటనే అరెస్టు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్‌చేశారు. సీఐటీయూ మండల నాయకులు లింగన్న ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మీతో కలిసి వినతిపత్రం అందజేశారు.

గుర్తింపులేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం న్యూటౌన్, జూలై 31: ప్రభుత్వ గుర్తింపులేని విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం డీఈఓకు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబులేసు మాట్లాడుతూ నగరంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా విద్యాసంస్థలు వెలిశాయన్నారు. విద్యావ్యవస్థను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు మాఫియాగా తయారు చేశాయన్నారు. ఇలాంటి వాటిపై వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, ప్రదీప్, రాజు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

అనంతపురం క్రైం, జూలై 31: పెళ్లి ఇష్టం లేదని నగరానికి చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. నగరంలోని వినాయక్‌నగర్‌కు చెందిన మాబున్నీసా(20) బుధవారం తెల్లవారుజామున తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్న క్రమంలో పెళ్లి ఇష్టం లేని ఆమె మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీఈఓల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జూలై 31: వ్యవసాయ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎంపీఈఓల సంఘం నాయకులు కోరారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు నరసింహరాజు, రామమూర్తి, కరుణాకర్ మంత్రికి వినతి పత్రం అందించారు. ఎంపీఈఓలకు ఎంటీఎస్ లేదా హెచ్ఆర్ పాలసీతో రూ.35వేల వేతనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ.. ఎంపీఈఓల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మంత్రిని కలిసిన పాస్టర్లు



మంత్రి పయ్యావుల కేశవ్‌ను సత్కరిస్తున్న పాస్టర్లు

అనంతపురం రూరల్, జూలై 31: పాస్టర్ల సమస్యలపై ఆ ర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్లకు సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, వైస్‌ప్రెసిడెంట్ మార్క్, కార్యదర్శి ఆనంద్, కోశాధికారి జీవన్‌బాబు, ఈసీ మెంబర్లు జహంగీర్, జామువా, పాస్టర్ లాబాను, సుధాకర్ పాల్గొన్నారు.

జగన్ పత్రిక ప్రతుల దహనం



జగన్ పత్రిక ప్రతులు దహనం చేస్తున్న తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్, జూలై 31: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అనంత క్లబ్‌పై మాట్లాడిన మాటలను జగన్ పత్రికలో వక్రీకరించి ప్రచురించారంటూ తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయనాయుడు తదితరులు పత్రిక ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. శ్రీకాంత్, సాదిక్, భార్గవ్, నాగార్జున, శ్రీకాంత్, హరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలను వక్రీకరించడం దారుణం: అనంత క్లబ్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి జగన్ పత్రికలో ప్రచారం చేయడం సరైంది కాదని టీడీపీ నాయకుడు రాయల్ మధు అన్నారు. బుధవారం స్థానిక ఆజాద్ నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అనంత క్లబ్‌కు సంబంధించి చట్టం మేరకు పోలీసులను సంప్రదించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారన్నారు. నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలు ప్రచారం చేయడం సరైంది కాదు: అనంత క్లబ్‌పై ఎమ్మెల్యే వ్యాఖ్యలను వక్రీకరిస్తూ జగన్ పత్రికలో అబద్ధాలు ప్రచారం చేయడం సరైంది కాదని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు అన్నారు. స్థానిక శ్రీనగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ, గుర్రం నాగభూషణంలతో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఎమ్మెల్యేను కలిసిన టీడీపీ బీసీసెల్ నాయకుడు

గార్లదిన్నె, జూలై 31: గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు అవుల క్రిష్టయ్య కలిశారు. బుధవారం ఎమ్మెల్యేను ఆయన స్వగ్రామమైన ఆలూరిలో అవుల క్రిష్టయ్య, కొయ్యాగూర పెద్దన్న, మల్లికార్జున, గ్యాస్ ఎల్లప్ప కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జయరాంను శాలువ, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు.

ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయం

అనంతపురం సెంట్రల్, జూలై 31: ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అభినందనీయమని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి వరదరాజులు అన్నారు. బుధవారం ఆర్టీఓ కార్యాలయంలో శ్రీవాణి డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో మొక్కలు నాటి శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నందకుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే సమాజంపట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ఆర్టీవో సురేష్ నాయుడు, ఎంవీఐ సునీత, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు అంజనేయులు, బాలచందర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

అనంతపురం న్యూటౌన్, జూలై 31: ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు చేశారు. బత్తలపల్లిలోని సంజయ్ ట్రేడర్స్, ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు చేశారు. ప్రిన్సిపల్ సర్టిఫికేట్ చూపకపోవడం, భౌతిక నిల్వలకు స్టాక్ వ్యత్యాసాలు ఉండటం, స్టాక్ రిజిష్టర్ నమోదు చేయకపోవడం తదితర తప్పిదాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో 92.25 లీటర్ల రూ.69,390 విలువ చేసే పెస్టిసైడ్స్ కు వ్యవసాయ అధికారుల చేత స్టాప్ సేల్ నోటీసు జారీ చేయించారు. తనిఖీల్లో సీఐ వెంకటరమణ, ఏఓ. వాసుప్రకాష్, ఏజీ శివప్రసాద్, ఎంఏఓ. ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం సెంట్రల్, జూలై 31: జేఎన్‌టీయూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్యను బీఎస్పీ నాయకులు కోరారు. బీఎస్పీ నియోజకవర్గ సభ్యులు కుళ్లాయప్ప, హరిప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులను సామాజిక వర్గాల వారిగా విభజించిన గత ఉన్నతాధికారులు ప్రమోషన్లు, ఇంక్రిమెంట్‌లలో వివక్ష చూపారని వాపోయారు. కూటమి ప్రభుత్వంలో పారదర్శకమైన పాల న అందించి న్యాయంచేయాలని కోరారు. అనంతరం రిజిస్ట్రార్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హేమసుందర్, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ రహిత నీటిని అందిస్తాం

శింగనమల, జూలై 31: గ్రామాల్లో ప్రజలకు ఫ్లోరైడ్ రహిత నీటిని అందిస్తామని టీడీపీ నాయకులు తెలిపారు. బుధవారం మండలంలోని ఆకులేడు గ్రామంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్‌ను వారు ప్రారంభించారు. రహంతుల్లా, నాగభూషణ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బిందె నీ రు రూ.10తో విక్రయించిందని, టీడీపీ అధికారంలోకి రాగానే రూ.5కే అందిస్తున్నామన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

చెన్నేకొత్తపల్లి, జూలై 31: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ చైర్‌పర్సన్ మేరివటమట్టం, నీకేగంగూలి పేర్కొన్నారు. స్థానిక టింబక్టు కార్యాలయంలో మహాశక్తి సమాఖ్య 12వ వార్షిక మహాసభను నిర్వహించారు.

మార్కెట్ యార్డు మరింత మెరుగుపడాలి: కలెక్టర్



చీనీ వ్యాపారులు, రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురంరూరల్, జూలై 31: అనంత వ్యవసాయ మార్కెట్ యార్డు మరింత మెరుగుపడేలా పనిచేయాలని ఆ శాఖ అధికారులను కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ యార్డును సంబంధిత అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. యార్డులోని చీనీ మార్కెట్‌ను సందర్శించారు. చీనీ వేలం గురించి రైతులను, వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ఈనామ్ వేలం గురించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనంతరం ఎస్ఎస్ఎఫ్ ఫ్రూట్స్ మండి వారు రైతుల నుంచి కొన్న చీనీ కాయలు, డ్రాగన్ ఫ్రూట్స్ ఇతర పండ్లను గ్రేడింగ్ చేసి ఢిల్లీ, ముంబై లాంటి ప్రదేశాలకు రవాణా చేస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమైయ్యారు. గతేడాది కంటే ఈ ఏడాది మార్కెట్ ఫీజు వసూళ్లు ఎందుకు తగ్గాయని ప్రశ్నించారు. నిరుపయోగంగా ఉన్న గోదాములను గుర్తించి వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న గోదాములను బాడుగకు ఇచ్చే విధంగా అవసరమున్న ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రైవేట్ సంస్థలకు పబ్లిసిటీ ద్వారా తెలియజేసి వాటిని ఉపయోగపడే విధంగా చూడాలన్నారు. ఏడీ సత్యనారాయణ చౌదరి, అనంత యార్డు కార్యదర్శి జయలక్ష్మి, డీఈ రఘునాథ్ పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రి పరిశీలన: జిల్లా సర్వజన ఆస్పత్రిని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ బుధవారం పరిశీలించారు. గంటపాటు ఆస్పత్రిలోనే ఉంటూ పలు విభాగాలను స్వయంగా వెళ్లి పరిశీలించారు. గైనిక్, బాలింతల వార్డులతో పాటు, క్షయ, డయాలసీస్, ఎమర్జెన్సీ, ఐసీయూ వార్డులను పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో ఆస్పత్రి మ్యాప్ చూపించుకుంటూ ఎక్కడ ఏఏ విభాగం ఉందో తెలుసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో ఆగిపోయిన నిర్మాణ పనులను అధికారులతో మాట్లాడుతూ అక్కడ ఏమి నిర్మిస్తున్నారని, ఏనిధులతో కట్టిస్తున్నారు, ఎవరుకాంట్రాక్టరు, ఎందుకు పనులు ఆగాయి అని ప్రశ్నించారు. కొంతమంది గైనిక్ డాక్టర్లతో ఆ విభాగంలో నెలకొన్న సమస్యలు, డాక్టర్లు పడుతున్న ఇబ్బందులు గురించి కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ. డాక్టర్ శివకుమార్, ఇంజనీరింగ్ అధికారులు చంద్రశేఖరరెడ్డి, నాయుడు పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంక్‌ల పరిశీలన

గుంతకల్లుటౌన్, జూలై 31: పట్టణ శివారులోని మున్సిపల్ ఎస్ఎస్ ట్యాంక్‌లను బుధవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... శ్రీశైలం డ్యాం ద్వారా త్వరలో హంద్రీనీవా కాలువకు నీరు వదలనున్నారన్నారు. నీటిని పంపింగ్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంపింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ హరికృష్ణ పాల్గొన్నారు.

నేడు గుండె వైద్యశిబిరం

గుంతకల్లుటౌన్, జూలై 31: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని వాసవి నిత్యాన్నసత్రంలో గురువారం లయన్స్ క్లబ్ హార్ట్‌కేర్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు గోపాలత బుధవారం ప్రకటనలో తెలిపారు. అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆసుపత్రి సిబ్బంది ఈ వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రైవేట్ పాఠశాల స్టాక్‌రూం సీజ్

రాయదుర్గంరూరల్, జూలై 31: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నోట్ పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎంఈఓ నాగమణి ఆ పాఠశాలను తనిఖీ చేసి స్టాక్‌రూంను సీజ్ చేశారు. స్థానిక ప్రైవేటు పాఠశాలల్లో నోటు పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో గురువారం ఆమె సెయింట్‌పాల్స్, నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలను తనిఖీ చేశారు. అందులో నారాయణ పాఠశాలలో నోటుపుస్తకాలు, యూనిఫాంను గుర్తించి స్టాక్‌గదిని సీజ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయించకూడదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

పనులు కల్పించడంతో నిర్లక్ష్యం తగదు

రాయదుర్గం రూరల్, జూలై 31: ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఏపీఓ దేవరాజ్ సిబ్బందిని హెచ్చరించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో అవెన్యూ ప్లాంటేషన్, బ్లాంక్ ప్లాంటేషన్, హార్టికల్చర్ పనులు విరివిగా కూలీలకు కల్పించాలన్నారు. మండలంలో 290 ఎకరాలకు లక్ష్యం కాగా 180 ఎకరాలు హార్టికల్చర్ ఏర్పాటుకు మంజూరు అయిందన్నారు. 19 పంచాయతీలలో తప్పనిసరిగా ప్రతి కూలీకి పనులను కల్పించాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

కాలువలో పూడికతీత

విడపనకల్లు, జూలై 31: మండలంలోని గడేకల్లు గ్రామం వద్ద ఉన్న జీబీసీ పరిధిలోని 9వ కాలువలో పూడిక తీత పనులను టీడీపీ నాయకులు బుధవారం ప్రారంభించారు. రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందివ్వాలని మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలు జారీ చేశారని, దీంతో 9 వ కాలువలో పూడిక తీత పనులను చేపట్టామని నాయకులు తెలిపారు. గత వైసీపీ పాలనలో 9వ కాలువకు సాగు నీరు అందక రైతులు వేల ఎకరాలు బీళ్లు పెట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 9 వ కాలువ పూడిక తీత పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

యల్లనూరు, జూలై 31: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం రానున్నట్లు ఎంఈఓ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. నోటిఫికేషన్ వెలువడిన రోజు నోటీసు బోర్డుపై ఓటర్ల జాబితా అతికించడం జరుగుతుందని చెప్పారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 5వ తేదీన తెలపాల్సి ఉంటుందన్నారు. 8వ తేదీ ఉదయం ఎన్నికలు నిర్వహించడంతో పాటు అదేరోజు చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఎన్నికైన సభ్యులచేత అదేరోజు ప్రమాణస్వీకారం, మొదటి సమావేశం కూడా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ

కుందుర్పి, జూలై 31: మండలంలోని తెనగల్లు గ్రామంలో ఉపాధి హామీ పనులలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయంటూ గ్రామస్థులు టీడీపీ నాయకులతో కలిసి ఇటీవల జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఫీల్డ్ అసిస్టెంట్ రవిచంద్రారెడ్డిపై అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏపీడీ రమేష్ నాయక్ బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో కలిసి గ్రామంలో ఉపాధి హామీ పనులపై మరోసారి విచారణ చేపట్టారు. పూర్తిస్థాయిలో విచారించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

గత ప్రభుత్వ పథకాల్లో అక్రమాలను నిగ్గుతేల్చండి

బెళుగుప్ప, జూలై 31: గత వైసీపీ ప్రభుత్వ పథకాలలో జరిగిన అక్రమాలను నిగ్గుతేల్చాలంటూ టీడీపీ నాయకులు మండల సమావేశంలో అధికారులను కోరారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న టీడీపీ నాయకులు పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, రాధాకృష్ణ మాట్లాడుతూ.. బెళుగుప్ప, ఎర్రగుడి గ్రామాల్లో ప్రభుత్వం ఇళ్లు పూర్తిగా నిర్మించకుండానే బిల్లులు మంజూరు చేశారని, విచారణ చేసి అక్రమాలను నిగుతేల్చాలని ఎంపీడీవో సుబ్బరాజు, ఎంపీపీని డిమాండ్ చేశారు. అలాగే ఆడుదాం ఆంధ్ర కింద మండలానికి మంజూరైన క్రీడా సామగ్రి ఏమయ్యాయో సచివాలయ సెక్రెటరీలు తెలపాలని కోరారు. తర్వాత గ్రామాల్లో సమస్యలను సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని విన్నవించారు. ఎంఈవో మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పుష్పావతి, జీడిపల్లి సర్పంచ్ వెంకటనాయుడు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్ఎంకు సన్మానం

కుందుర్పి, జూలై 31: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఎం కిష్టప్ప పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హాజరై అయనను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మోరేపల్లి మల్లికార్జున, మండల కన్వీనర్ ధనుంజయ, మండల ఇన్‌చార్జి ధర్మతేజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కిష్టప్పను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

భూకబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

● ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, జూలై 31: ఎవరైనా ఎక్కడైనా భూకబ్జాలకు పాల్పడితే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హెచ్చరించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పద్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత వ్యవసాయ, విద్య, విద్యుత్, ఉపాధిహామీ పనులు తదితర వాటిపై చర్చ జరిగింది. తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో బడిబయట పిల్లలు ఎవరూ ఉండకూడదని, అలాంటి వారిని ప్రతిఒక్కరినీ గుర్తించి బడిలో చేర్పించాలని సూచించారు. మండలంలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతుంటాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కొన్ని రోజులుగా సీఎం చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్‌కు, మంత్రి నారా లోకేష్‌కు అధికంగా భూకబ్జాలపై ఫిర్యాదులు అందుతున్నాయని, ఇక్కడ అలాంటివి జరిగితే ఉపేక్షించమని అన్నారు. భూకబ్జాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పేదల భూములను, స్థలాలను బలవంతులు లాక్కోవడం చాలా దుర్మార్గమన్నారు. మండలంలో అలాంటివి జరిగే ఉంటే వాటిని గుర్తించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రఘునాథ్, ఈఓపీఆర్డీ దాస్, విద్యుత్ ఏఈ లక్ష్మిరెడ్డి, ఏఓ సాయికుమార్, జేఈఈ జగదీష్, ఎంపీటీసీ సభ్యులు ముల్లంగి కల్పన, తిమ్మప్ప, సర్పంచులు ముల్లంగి భారతి, భాస్కర్‌నాయుడు, వనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

యల్లనూరు, జూలై 31: మండల అభివృద్ధికి అందరం సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ పరిస్థితులు చూస్తుంటే చాలా బాధగా ఉందన్నారు. ప్రధాన శాఖల అధికారులు వారివారి శాఖల వివరాలను తెలపలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. నిధులు మంజూరైనా పనులను పూర్తిచేయలేని స్థితిలో గత ప్రభుత్వం నడిచిందన్నారు. మండలంలో ప్రధానంగా తాగునీటి సమస్య తలెత్తుతోందని, వీటికి పరిష్కారమార్గాలు ఏమని అడిగితే ఇక్కడి అధికారులు చెప్పలేని స్థితిలో ఉండడం దారుణమని అన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీలు పార్టీలకు అతీతంగా అందరం కలిసి సమస్యలపై చర్చించి మండలాన్ని అభివృద్ధివైపు నడిపిద్దామని ఈ సందర్భంగా ఆమె సభ్యులను కోరారు.

నిధులు ఎక్కడ ఖర్చుచేశారు?

గతేడాదిలో మండల గ్రాంట్ కింద గిర్రమ్మబావి- మేడికుర్తి వద్ద పైప్‌లైన్ వేశామని చెబుతున్నారు. రూ.3లక్షలతో నిట్టూరులో పైప్‌లైన్ వేశామని చెబుతున్నారు అక్కడ పనులు జరిగినట్లు, వాటికి సంబంధించిన వివరాలు తెలపాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు. అధికారులు నోరు మెదపకపోవడంతో పక్కనే ఉన్న జడ్పీటీసీ సభ్యుడు భోగాతి ప్రతాప్‌రెడ్డి ఖర్చుచేసిన వాటి వివరాలు చెప్పలేని పరిస్థితుల్లో మీరు ఉన్నారా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

హాజరుకాని అధికారులపై చర్యలు చేపట్టండి

సర్వసభ్య సమావేశం ఉందని తెలియజేసినప్పటికీ హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వీర్రాజును ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రధానంగా వెటర్నరీ, హార్టికల్చర్ అధికారులు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీపీ గంగాదేవి, తహసీల్దార్ శ్వేత, వైస్ ఎంపీపీ సావిత్రి, రంగయ్య సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలవను కలిసిన వైసీపీ ఎంపీటీసీలు


కాలవ శ్రీనివాసులుతో వైసీపీ ఎంపీటీసీ సభ్యులు

బొమ్మనహాళ్, జూలై 31: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును మండలంలోని వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామంలో టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు ముల్లంగి నాగమణి స్వగృహంలో కాలవ శ్రీనివాసులును కొళగానహళ్లి ఎంపీటీసీ తిమ్మప్ప, నేమకల్లు ఎంపీటీసీ చిక్కణ్ణ, బండూరు ఎంపీటీసీ హనుమేష్‌తో పాటు ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, కురవళ్లి, లింగదహాళ్, ఉంతకల్లు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు కలిశారు. ముల్లంగి నాగమణి ఎంపీపీగా ఎన్నుకునేందుకు తమకు ఎలాంటి అభ్యంతరము లేదని, ఇంతకుముందే నాగమణికి ఎంపీపీ పదవి ఇవ్వాలని తెలిపినట్లు వారు కాలవ శ్రీనివాసులుతో అన్నారు.

కళాశాలలో వసతులు కల్పించండి

బొమ్మనహాళ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మౌలికవసతులు కల్పించాలని ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్, అధ్యాపకులు బుధవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు విన్నవించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారు ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు.

ఉపసర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

బొమ్మనహాళ్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ పయ్యావుల హనుమంతప్పను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పరామర్శించారు. పయ్యావుల హనుమంతప్ప కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

కణేకల్లు : మండల రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును సన్మానించారు. రాయదుర్గంలో బుధవారం వారు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

బాల్యవివాహాల నిర్మూలనకు పాటు పడాలి

రాయదుర్గం రూరల్, జూలై 31: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ పాటు పడాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సూచించారు. పట్టణంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో బుధవారం ఆమె బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్యవివాహాలతో శారీరకంగా, మానసికంగా అనారోగ్యాలు తలెత్తుతాయన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహహింస నిరోధక విభాగాల సోషల్ కౌన్సిలర్ ఉమాదేవి, పీఓ వెంకటలక్ష్మి, సీడీపీఓ ప్రభావతమ్మ, ఎంపీడీఓ అల్లాబకాష్, ఎంఈఓలు నాగమణి, వెంకటరమేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేనా..?

యాడికి, జూలై 31: మండలంలోని వెంగన్నపల్లి గ్రామ పంచాయతీలో పింఛన్ల పంపిణీపై ఉత్కంఠ నెలకొంది. బోగస్ పింఛన్ల ఏరివేతపై అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గత జూలై 1న జరిగిన పింఛన్ల పంపిణీని గ్రామస్థులు అడ్డుకున్నారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ సావిత్రి, సీఐ నాగార్జునరెడ్డి గ్రామస్థులతో చర్చలు జరిపారు. అర్ధరాత్రి వరకు అధికారులకు, గ్రామస్థులకు వాగ్వాదం కొనసాగింది. ఆగస్టు నెలకు బోగస్ పింఛన్లపై విచారించి వాటిని నిలిపివేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు. ఆ తర్వాత రాత్రి ఒంటిగంట సమయంలో అధికారులు పింఛన్ల పంపిణీ చేశారు. కాగా బోగస్ పింఛన్లపై అధికారుల విచారణ పూర్తికాకపోవడంతో గురువారం చేపట్టనున్న పింఛన్ల పంపిణీపై ఉత్కంఠ నెలకొంది. దీనిపై ఎంపీడీఓ సావిత్రిని వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనల మేరకు పంపిణీ చేస్తామని తెలిపారు.

పెన్షన్ల పంపిణీని అడ్డుకుంటే కేసుల నమోదు

పింఛన్ల పంపిణీని ఎవరైనా అడ్డుకుంటే కేసులు నమోదుచేస్తామని సీఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించాల్సిందేనని ఆయన తెలిపారు.

వ్యవసాయానికి 9గంటల కరెంట్ ఇవ్వండి

యాడికి, జూలై 31: వ్యవసాయానికి 9గంటల కరెంట్ సరఫరా చేయాలని కోరుతూ మండలకేంద్రానికి చెందిన పలువురు రైతులు బుధవారం ట్రాన్స్‌కో ఏఈ రాజారావుకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని, బోరుబావుల్లో ఉన్న కొద్దిపాటి నీటితో పంటలను కాపాడుకుందామంటే ఇక్కడ వ్యవసాయానికి కరెంట్ సరఫరా అస్తవ్యస్తంగా ఉందని వాపోయారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయానికి 9గంటలు కరెంట్ సరఫరా చేయాల్సిన ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. మండలంలో 7గంటలు మాత్రమే కరెంట్ సరఫరా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా 9గంటల కరెంట్ సరఫరా చేయాలని కోరారు. లేకపోతే కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

రైతుల అభ్యున్నతికి కేవీకే కృషి ఎనలేనిది

కళ్యాణదుర్గంరూరల్, జూలై 31: రైతుల అభ్యున్నతికి కృషి విజ్ఞాన కేంద్రం సేవలు ఎనలేనివని పట్టణంలోని కేవీకే ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త రాధాకుమారి తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన వేదిక కేంద్రం స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం ఆ కేంద్రంలోనే స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు పంటల సాగుకు సంబంధించిన విషయాలు తెలియజేయడానికి దేశంలోనే మొట్టమొదటిసారిగా పుదుచ్చేరిలో కేవీకే స్థాపించారని తెలిపారు. రైతులకు పాడి పంటలపై అవగాహన కల్పిస్తూ వారి అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తోందన్నారు. రైతులకు కళ్యాణదుర్గం కేవీకే చేసిన సేవల్ని గుర్తు చేశారు. ఎస్ఎస్ మల్లీశ్వరి, శాస్త్రవేత్తలు యుగంధర్, మల్లికార్జున, హరిణి, శిరీష, రైతులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు బహుమతి ప్రదానం

గుంతకల్లు, జూలై 31: క్రికెట్ టోర్నమెంటు విజేత జట్టుకు టీడీపీ పట్టణాధ్యక్షుడు ట్రోఫీ, నగదు బహుమతిని అందజేశారు. పాతగుంతకల్లు మస్తాన్ వలి ఉరుసు ఉత్సవాలలో భాగంగా బుధవారం మధ్యాహ్నం ఎస్కేపీ డిగ్రీ కళాశాల క్రీడా స్థలంలో క్రికెట్ టోర్నమెంటు ఫైనల్‌ను నిర్వహించారు. తుదిపోరులో వాల్మీకి ఎలెవెన్, లక్కీ ఎలెవెన్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన వాల్మీకి లెవెన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 80 పరుగులు చేయగా, చేజింగ్‌కు దిగిన లక్కీ ఎలెవెన్ జట్టు 9.3 ఓవర్లలో 81 పరుగులు సాధించి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు బండారు ఆనంద్ రూ.20 వేలను బహుమతిగా అందజేశారు. అలాగే రన్నరప్ జట్టుకు రూ. 10 వేలను గుండాల పంచాయతీ సర్పంచు శ్రీపతి నాయుడు అందజేశారు. కాగా టోర్నమెంటులో విన్నర్, రన్నర్ జట్లకు తాడిపత్రి ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి ఆర్థిక సాయంతో కప్పులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్కేపీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, సింగిల్ విండో సొసైటీ మాజీ అధ్యక్షుడు పాల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రంపై దాడులు

యాడికి, జూలై 31: కేశవరాయునిపేట గ్రామ సమీపాన నాటుసారా తయారీ కేంద్రంపై బుధవారం గుత్తి సెబ్ అధికారులు దాడులు చేశారు. గ్రామ శివారులోని 2కిలోమీటర్ల దూరంలో గల కొండ ప్రాంతంలో సారా తయారుచేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు నిర్వహించినట్లు సెబ్ అధికారులు తెలిపారు. సారా తయారుచేసే బట్టీని, రెండు ఇనుప డ్రమ్ములను, నాలుగు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1000లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. తర్వాత నిర్వాహకులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

పుట్లూరు, జూలై 31: మండలకేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని టీడీపీ మండల నాయకుడు పుట్లూరు పుల్లారెడ్డి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు విన్నవించారు. ఢిల్లీలోని పార్లమెంట్ భవనం వద్ద బుధవారం ఎంపీని కలిసి మండలకేంద్రంలోని తాగునీటి సమస్యను వివరించినట్లు ఆయన తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరామన్నారు. బోర్ల తవ్వకానికి నిధులను కేటాయించాలని ఎంపీని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

రాళ్లదాడి కేసులో వైసీపీ మద్దతుదారుడి అరెస్ట్

తాడిపత్రి, జూలై 31: ఎన్నికల మరుసటి రోజు జరిగిన రాళ్లదాడి కేసుకు సంబంధించి బుధవారం వైసీపీ మద్దతుదారుడు సంజీవను అరెస్ట్‌చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. దాడులకు సంబంధించి నమోదైన కేసులో భాగంగా సంజీవను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని చెప్పారు.

ఘనంగా పీర్లావలి ఉరుసు

కణేకల్లు, జూలై 31: మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో పీర్లావలి ఉరుసు ఉత్సవాలు బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో భాగంగా మంగళవారం గంధం కార్యక్రమం జరగగా.. బుధవారం వేలాది మంది భక్తుల సమక్షంలో ఉరుసును నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పీర్లావలి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి చక్కెర చదివింపులు జరిపించారు. కార్యక్రమంలో నిర్వాహకులు బండి హనుమంతప్ప, పూల రంగప్ప, యర్రప్ప, రంగారెడ్డి, చిన్ననల్లారెడ్డి, పెద్ద రంగారెడ్డి, ఉదయ్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై మంత్రికి వినతి

ఉరవకొండ, జూలై 31: గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు బుధవారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతి పత్రాలను అందజేశారు. కొనకొండ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నారాయణస్వామి, రాంబాబు, లీలాధర్ తదితరులు అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని కలిసి గ్రామసమస్యలపై విన్నవించారు. జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రహరీతో పాటు పలు వీధుల్లో సీసీ రోడ్లు,డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. అలాగే వ్యాసాపురం సర్పంచ్ సీతారాముడు, వజ్రకరూరు మండలం గంజికుంటకు చెందిన టీడీపీ నాయకులు మంత్రికి గ్రామ సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు.


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న వ్యాసాపురం సర్పంచ్ సీతారాముడు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ


లక్ష్మన్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కుందుర్పి, జూలై 31: మండల కేంద్రంలో ఇటీవల విద్యార్థిని కాపాడేందుకు వెళ్లి మృతి చెందిన నవీన్ కుటుంబాన్ని, మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని, కమ్యూనిస్టు నేత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు లక్ష్మన్న కుటుంబాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బుధవారం పరామర్శించారు. తొలుత లక్ష్మన్న కుటుంబ సభ్యులను ఇంటికెళ్లి పరామర్శించారు. లక్ష్మన్న కమ్యూనిస్టు నేతగా.. ఉపాధ్యాయుడిగా అనేక సేవలందించారని కొనియాడారు. ఆయన మృతి తీరని లోటన్నారు. ఆదుకుంటామని కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. అలాగే స్థానిక బ్రిడ్జి కుంటలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన ఆరోతరగతి విద్యార్థి విష్ణు కుటుంబాన్ని, అతడిని కాపాడేందుకు వెళ్లి మృత్యువాతపడిన నవీన్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. నవీన్ ఎంతో మందికి ఆదర్శమన్నారు. ఆయన కుటుంబానికి రూ. 25 వేలు ఆర్థిక సాయం అందజేసి అతడి కుటుంబంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా విద్యార్థి విష్ణు తల్లిదండ్రులను పరామర్శించి రూ.పది వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ధనుంజయ, మాజీ జడ్పీటీసీ మల్లికార్జున, నాయకులు మల్లికార్జున, రాఘవేంద్ర బాబు, శ్రీనివాసులు, చిత్రలింగప్ప, ప్రసాద్, రంగనాథ్, రామకృష్ణ, ఏపీ రామాంజనేయులు, రామమూర్తి, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని ఒక్కరోజులోనే పూర్తి చేయాలి

కళ్యాణదుర్గం, జూలై 31: పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఒక్కరోజులోనే వందశాతం పూర్తయ్యేలా కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సచివాలయ సిబ్బంది అధికారుల సహకారంతో, ఆయాగ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని గురువారం ఇంటింటికీ వెళ్లి అర్హులకు పింఛన్లు అందించాలన్నారు. ఉదయమే 6 గంటలకే పంపిణీ ప్రారంభించాలన్నారు. వందశాతం పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చౌళం మల్లికార్జున, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు అమిలినేని లక్ష్మీనారాయణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ లింగా సురేంద్ర, బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ సజావుగా జరగాలి

రాయదుర్గంరూరల్: మండలంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని ఎంపీడీఓ అల్లాబకాష్ సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో 5,333 మంది పింఛన్‌దారులకు గాను రూ. 2,27,45,500 లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేపట్టాలన్నారు. మిగిలిన పింఛన్లను మరునటి రోజున కూడా పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటివద్దకే పింఛన్

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా గురువారం 5844మంది పింఛన్‌దారులకు ఇంటివద్దనే పింఛన్ పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీఓ కవిత ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది చేత ఉదయం 5గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

హాజరుకానున్న మంత్రి కేశవ్

కూడేరు: రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్ గురువారం మండలంలోని అంతరగంగ గ్రామంలో పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు టీడీపీ వర్గాలు బుధవారం ప్రకటనలో తెలిపాయి. ఇందుకు సంబంధించి గ్రామంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

నాడు-నేడు పనులపై డీఈఓ విచారణ


కమ్మూరులో రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ వరలక్ష్మి

కూడేరు, జూలై 31 : గత వైసీపీ పాలనలో పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన మొదటి విడత నాడు- నేడు పనుల్లో అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు అందడంతో.. అక్రమార్కుల భరతం పట్టేందుకు డీఈఓ వరలక్ష్మి సిద్ధమయ్యారు. ఈ మేరకు బుధవారం ఆమె మండలంలోని కమ్మూరు, కొర్రకోడు, కూడేరు ఆదర్శ ప్రాథమిక పాఠశాల్లో నాడు-నేడు పనులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కమ్మూరు ప్రాథమిక పాఠశాలలో పనులు చేయడానికి స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ మంజుల సంతకాలు రికార్డులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రికార్డుల్లో కమిటీ సభ్యులు సంతకాల్లో తేడా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో అమర్చిన టైల్స్‌ను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో అప్పుడే పగిలిపోయాయని గ్రామస్థులు తెలిపారు. అలాగే విద్యార్థులకు తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అనంతరం పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మంజుల రావడంతో రికార్డులో సంతకం ఎందుకు పెట్టలేదని డీఈఓ ప్రశ్నించారు. దీంతో ఆమె తనకు ఏమీ తెలియదని, కేవలం చెక్కుల మీద మాత్రమే సంతకాలు చేయించారని తెలిపారు. దీంతో డీఈఓ నాడు నేడు పనులకు సంబంధించిన రికార్డును సీజ్ చేసి మరోసారి విచారణ చేస్తామని, అందరు రావాలని సూచించారు. అనంతరం కొర్రకోడు ప్రాథమిక పాఠశాలలో పనులకు సంబంధించిన రికార్డులు, ఓచర్లను పరిశీలించారు. అక్కడా సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కూడేరు ఆదర్శ పాఠశాలలో జరిగిన పనులపై గ్రామస్థులు డీఈఓకు వివరించారు. వివిధ గ్రామాల్లో నాడు-నేడు పనులపై పూర్తిస్థాయి విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

పౌరసరఫరాల గోదాము తనిఖీ

ఉరవకొండ, జూలై 31: పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో గల పౌరసరఫరాల గోదామును డీఎస్‌వో శోభారాణి, ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడే వీఆర్వోలతో రేషన్ పంపిణీపై సమీక్షించారు. డీఎస్‌వో మాట్లాడుతూ జిల్లాలో 640రేషన్ దుకాణాలు ఉన్నాయన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా గ్రామాలు, పట్టణాలలో నిర్దేశించిన ప్రాంతాలలో బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో ఒక్క స్టాక్ పాయింట్‌కు మాత్రమే 30మెట్రిక్ టన్నుల రాగులు వచ్చాయన్నారు. బియ్యంతో పాటు మూడు కేజీల వరకూ రాగులు కానీ, జొన్నలు కానీ తీసుకునే అవకాశముంటుందన్నారు. కంది పప్పు పంపిణీకి సంబంధించి ప్రభుత్వ నిర్ణయం తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. మూడు నెలల నుంచి చక్కెర పంపిణీ ఆగిపోయిందన్నారు. డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ హరిప్రసాద్, స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించండి

యాడికి, జూలై 31: ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటల సాగుపై చిన్న, సన్నకారు రైతులకు అవగాహన పెంపొందించాలని ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. మండలకేంద్రంలోని సమావేశభవనంలో బుధవారం ఆమె ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 5ఎకరాల్లోపు భూమి ఉన్న రైతుల నుంచి నిమ్మ, దానిమ్మ, మామిడి, నేరేడు, చీనీ వంటి ఉద్యానవన పంటల సాగుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీఓ రమేష్, పలువురు టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్ల రాజీనామా

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ముగ్గురు రాజీనామా చేశారు. యాడికి వి. గంగాధర్, రాయలచెరువు శర్మాస్‌వలి, కోనుప్పలపాడు వై. గంగాధర్ వ్యక్తిగత కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు ఎంపీడీఓకు రాజీనామా లేఖలు అందించారు.

ఎస్ఎస్ ట్యాంకులోకి నీటి పంపింగ్

విడపనకల్లు, జూలై 31: మండలంలోని ఎస్ఎస్ ట్యాంక్‌లోకి నీటి పంపింగ్‌ను బుధవారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 9 గ్రామాలకు తాగునీరు అందించే ఎస్ఎస్ ట్యాంక్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పూర్తిగా ఎండిపోయిందన్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఇక మీదట ఇలాంటి సమస్యలు తలెత్తకుండా మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో జీబీసీ కాలువ నుంచి ఎస్ఎస్ ట్యాంకులోని నీటిని పంపింగ్ చేస్తున్నామన్నారు. ట్యాంక్‌ను పూర్తి స్థాయిలో నింపి మండల ప్రజలకు తాగు నీటి కొరత లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తిప్పారెడ్డి, చంద్రశేఖర్, జనార్ధన నాయుడు, నాయకులు రాజస్వామి, హనుమంతు, సినిమా రామాంజనేయులు, పరమేశప్ప పాల్గొన్నారు.


నీటి పంపింగ్‌ను ప్రారంభించిన టీడీపీ నాయకులు